KSR02B105C

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

జనవరి 24, 2016

స్నేహ

'నట'రాజం

ENTERED

పజిల్ ప్రపంచం

హద్దులేని యాక్షన్



రణ్‌వీర్ సింగ్ అద్దూ ఆపు లేని భావోద్వేగాలు, అల్లరి చేష్టలతో బాలీవుడ్‌లో మరో బ్యాడ్‌బాయ్‌గానూ, నాటీగాను పేరు తెచ్చుకున్నాడు. 'బ్యాండ్ బాజా బరాత్' ఆ తర్వాత వచ్చిన 'లేడీస్ వర్సెస్ రికీ బల్' చిత్రాలు అతడికి దగ్గరగా అనిపిస్తాయి. అలాంటి ఈ తుంటరి కుర్రాడు 'లూటెరా' వంటి పీరియాడికల్‌లో చాలా మెచ్యూర్డ్ నటనతో ఆకట్టుకుని అందర్నీ మెప్పించాడు. ఈ మధ్యే విడుదలై రికార్డులు సృష్టిస్తున్న చారిత్రాత్మక చిత్రం 'బాజీరావు మస్తానీ'తో రణ్‌వీర్ బాలీవుడ్ సూపర్‌స్టార్లనే ఆలోచనలో పడేశాడు. యుద్ధ సన్నివేశాలు, కీలక ఘట్టాల్లో కళ్లతోటే నవరసాల్ని పలికించి మెప్పు పొందాడు. యుద్ధక్షేత్రంలో వీరోచిత పోరాటం, మానసిక క్షేత్రంలో భావోద్వేగ సంగ్రామం రెంటినీ బంధించిన ప్రతి సన్నివేశంలో బాజీరావుగా రణ్‌వీర్‌పై తప్ప మరెవరిపై దృష్టి నిలపలేడు ప్రేక్షకుడు. ఇంతటి సీరియస్ నటుడు దాగున్నాడనే విషయాన్ని పదిమందికీ గర్వంగా పంచుకుంటూ ఈ గూండే దాడిలో అభిమానులు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు.

- అమెరికా బ్లూమింగ్‌టన్‌లోని ఇండియానా విశ్వవిద్యాలయం పట్టభద్రుడు రణ్‌వీర్.
- నట వారసులతో కిక్కిరిసిపోయిన బాలీవుడ్‌లో నటుడయ్యే అవకాశం ఉందో లేదోనని తన మరో బలమైన క్రియేటివ్ రైటింగ్‌ను ఎంచుకున్నాడు.
- తొలుత పలు యాడ్ ఏజెన్సీల్లో కంటెంట్ రైటర్‌గా, సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గాను పనిచేశాడు.
- అతడి శరీరతీరు మోడలింగ్‌కు బాగా నప్పుతుందని యాడ్ ఫిల్మ్ అవకాశాలు చాలానే వచ్చాయి కానీ కాదనుకున్నాడు.
- నటనపై వ్యామోహం ఎక్కువవడంతో పోర్ట్‌ఫోలియోలతో దర్శకుల చుట్టూ తిరిగాడు కానీ అవకాశం దక్కడం చాలా కష్టమైపోయింది.
- మూడున్నరేళ్ల కష్టం తర్వాత యశ్‌రాజ్ ఫిల్మ్స్ నుంచి కబురందినా దర్శకుడు మనీశ్ శర్మను మెప్పించడానికి రెండు వారాల పాటు ఆడిషన్స్‌కు వెళ్లాల్సివచ్చింది.
- బ్యాండ్ బాజా బరాత్‌కు నువ్వే హీరో అనే మాట ఆదిత్య చోప్రా నోటి నుంచి వినగానే కారిడార్ వద్దకు వెళ్లి విపరీతంగా ఏడ్చేశాడట.
- అన్నీ విలక్షణ కథల్నే ఎంచుకునే రణ్‌వీర్ 'గోలియోంకీ రాస్‌లీలా రామ్‌లీలా'తో విమర్శకుల మెప్పును పొందడమే కాక భారీ కమర్షియల్ విజయాన్ని దక్కించుకున్నాడు.
- ముంబైకర్ అయినా ఓ ఢిల్లీవాలా (బ్యాండ్ బాజా బరాత్), ఓ బెంగాలీ (గూండే)గా, మరాఠి (బాజీరావు మస్తానీ), గుజరాతీ (రామ్‌లీలా), పంజాబీ (దిల్ దడ్‌ఖనే దో) ఇలా ఏ పాత్ర వేసినా ఆ ప్రాంత ఉచ్ఛారణ, వ్యక్తిత్వ శైలితో పాత్రకు జీవం పోసేస్తాడు.
- అనిల్ కపూర్ భార్య సునీత తరపు కుటుంబానికి చెందిన రణ్‌వీర్‌కు బోనీ కపూర్ కొడుకు అర్జున్ కపూర్ బెస్ట్‌ఫ్రెండ్. ఇద్దరు కలిసి 'గూండే'లో పోటాపోటీగా నటించారు.
- అర్జున్‌తో తప్ప ఎవరితోను అంతగా కనిపించడు. ఒంటరిగానే ఉండటానికి ఇష్టపడే రణ్‌వీర్ చాలాచాలా ఇంట్రావెర్ట్.
- కానీ, విపరీత భావోద్వేగాల్ని పబ్లిక్‌గా బయటపెట్టేసే రణ్‌వీర్‌ను ఆ సంగతి అడిగితే తన బుర్రలో 200 పాత్రలు కలియతిరుగుతుంటాయని, ఏది ఎప్పుడు బయటపడుతుందో తనకే తెలీదని నవ్వేస్తాడు.
- ఫంక్షన్లలో దర్శకులు, తోటి నటీనటుల్ని ముద్దులతో ముంచేయడం, అల్లరల్లరిగా ఫీట్లు, హావభావాలు ప్రదర్శించడం, ఉన్నట్టుండి కోప్పడటం, బఫూన్లా కామెడీ చేయడం వంటి పాత్రలు బాగా పరిచయం చేసేశాడు.
- పైకి అంత ఫన్నీగా, ఎనర్జెటిక్‌గా, సో హ్యాపీగా కనిపించే రణ్‌వీర్ నిజానికి చాలా లోతు మనిషి. చాలా మూడీగా, విచారకర భావనలతో ఉంటాడు. దాన్ని కప్పేసేందుకే ఈ అల్లరి అంతా.
- దీన్ని చూసే ప్రఖ్యాత నటుడు నసీరుద్దీన్ షా ఓ సందర్భంలో ఫూల్ అన్నాడు. దీన్ని రణ్‌వీర్ 'జీవితం ఓ రంగస్థలమైతే నేను ఫూల్‌గా నటిస్తాను.' అంటూ చాలా తేలిగ్గా తీసుకున్నాడు.
- విపరీత భావోద్వేగాలే కాదు విపరీతంగాను నటన కోసం కష్టపడతాడు. పీష్వా బాజీరావులా గాంభీర్యంగా ప్రవర్తించేందుకు, తన కంఠాన్ని కరకుగా మార్చుకునేందుకు షూటింగ్‌కు ముందే 21 రోజుల పాటు ఓ హోటల్ గదిలో తనను తాను బంధించుకుని విపరీతంగా ప్రాక్టీస్ చేశాడు.
- డిప్లొమేటిక్‌గా మాట్లాడటం అస్సలు రాదో ఇష్టముండదో తెలీదు గానీ ఇంటర్వ్యూల్లో తన వ్యక్తిగత సంబంధాలపై కూడా ఇంతకు ముందు ఎవరూ లేనంత ఓపెన్‌గా కబుర్లు చెప్పేస్తాడు. ఎంతలా అంటే అవి వినడానికి కూడా అతడంత ఓపెన్‌గా ఉండగలగాలి.
- ఈ బాలీవుడ్ కేసనోవా అమ్మాయిల సంగతులు పక్కన పెడితే అమ్మ అంజు, అక్క రితిక అంటే ప్రాణమిచ్చేంత ప్రేమ. ఇంకా వాళ్ల ముందు చిన్నారిలానే ప్రవర్తిస్తుంటాడు. అలుగుతుంటాడు.

KSR02B105

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

కథల కార్ఖానా



◆ మనలో మాట

కథలంటే ఇష్టం లేనిదెవ్వరికి? పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ కథలంటే ప్రాణం. మరి అవి మనల్ని ఊహా ప్రపంచంలో ఊరేగిస్తాయి. తెలియని కొత్త లోకాల్ని చూపిస్తాయి. ఎన్నో వింతలు, విడ్డూరాలను కళ్లకు కడతాయి. మాట్లాడే జంతువులు, పలకరించే పక్షులు, దెయ్యాలు, భూతాలు, రాకుమారుడు, రాజ కుమార్తెలు, పూటకూళ్లమ్మలు, భటులు, వికటకవులు అందరూ తారసపడతారు. మంచి చెడులు నేర్పడమే కాదు. విజ్ఞాన వికాసాలు అందిస్తారు. ఆపద వచ్చినప్పుడు విజ్ఞతతో ఎలా మెలగాలో చెప్తారు. ఒంటికన్ను రాక్షసులు మింగేయాలి అని చూసినప్పుడు ఆకాశమంత ఎత్తున్న రాక్షసుడిని ఒట్టి చేతులతో ఎలా హతమార్చవచ్చో చెప్తాయి. రాజకుమార్తెను కాపాడ్డానికి ఓ సామాన్యుడు సప్తసముద్రాలు ఎలా దాటాడో వర్ణిస్తాయి. అందుకే కథల లోకంలో విహరింస్తుంటే కలిగే మజానే వేరు.

అయితే ఇప్పుడు కథలు చెప్పేవారు వినేవారు అంతకంతకు తగ్గిపోతున్నారు. పొరపాటున పిల్లలు నోరు తెరిచి 'అమ్మా' కథ చెప్పవూ! అంటే 'పనిలో వున్నా కన్నా! నాన్ననడుగు' అన్న సమాధానం వస్తుంది. 'నాన్నా ! కథ చెప్పవూ!' అంటే ....ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చా ఇప్పుడు కుదరదంటారు. ఆ చిన్నారి బిక్కమొహం వేసుకుని ఏ టీవీ ముందో కూర్చుని కార్టున్ చానల్‌లో మునిగిపోతుంది. మరి ప్రేమగా పిల్చి ఒళ్ళో కూర్చోపెట్టుకుని 'అనగనగా' కథలు చెప్పడానికి అమ్మమ్మలు, తాతయ్యలు ఎక్కడో దూరంగా వుంటున్న రోజులాయె.

కుటుంబ పోషణలో పడిపోయి మనం మర్చిపోతున్న కథలనే కార్పొరేట్ కంపెనీలు నీతి కథలు చెప్తు చక్కగా పని చేయించుకుని లాభాలు పండిస్తున్నాయి. రాజకీయ నాయకులు సైతం వేదిక లెక్కిన దగ్గర్నుంచి బోలెడన్ని కథలు చెప్తున్నారు. చేసిన వాగ్దానాలనే తిప్పి తిప్పి సరికొత్తగా అల్లి వర్ణిస్తున్నారు. ఆ కథల మాయలో పడి... మళ్ళీ మళ్ళీ ఆ నేతలకే ఓట్లు గుద్దుతున్నారు జనం. ప్రతి కథలోను నీతి, అవినీతి, కపటం, మోసం, విజయం, పరాజయం వున్నట్టే నేతలు చెప్పిన వాటిలోను అవన్నీ వుంటాయి. సామాన్యుడి విజ్ఞతతో ఎవరు ఎందుకు ఏ కథలు చెప్తున్నారో తెలుసుకులని మెలగాలి. అచ్చంగా అనగనగా కథలోని సాహస యువకుల్లా అందరూ వ్యవహరించి.. ఓట్లు గుద్దించుకుని గద్దెనెక్కి లాభపడాలనుకునే వారికి తెలివిగా బుద్ధి చెప్పాలి. ■



టపా

అలరించిన సంక్రాంతి

సంక్రాంతి విశేషాలు చాలా చక్కగా వివరించారు. విచారిందగ్గ విషయం ఏమిటంటే హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు ఈ తరం వారు మిస్సవుతున్నారు. అలనాటి కళాకారులకు ఆదరణ లేక అదృశ్యమవడం చాలా బాధాకరమైన విషయం. మార్పు కథనం సమకాలీన సమాజపు పోకడలకు దర్పణం. గిరిజ జీవితం ప్రతి ఒక్కరికి గుణపాఠం కావాలి. ఎంతో వెలుగు వెలిగి అనామకంగా కనుమరుగు కావడం సినీ ప్రేమికులకు జీర్ణించుకోలేని చేదు వార్తగా మిగిలిపోయింది.

శివలెంక చంద్రశేఖర్, హైదరాబాద్

మనసున్న డాక్టర్

నేడు వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాలంటే గుండె గుబేలు మంటుంది. స్కానింగ్‌లు టెస్టులంటూ వేలకు వేలు గుంజేస్తారు డాక్టర్లు. సేవాదృక్పథంతో వైద్య సేవలందించేవారు కరువైన ఈ రోజుల్లో కార్మికులు, ఉద్యోగులకు వైద్యం అందిస్తూ వైద్యశాలనే ఇంటిగా మార్చిన చైనా డాక్టరు విశేషాలు చాలా బాగున్నాయి.

పి. రాజేశ్వరి, ఒంగోలు

సైన్స్ బొమ్మలు

ఆటబొమ్మల ద్వారా సైన్సు పాఠాలు చెప్పే అరవింద్ గుప్తాను మెచ్చుకోకతప్పదు. మేమడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక మా టీచర్లు విసుక్కున సందర్భాలెన్నో. బొమ్మల సహాయంతో బోధన తేలికవుతుందని, పిల్లల్లో సబ్జెక్టుపై ఆసక్తిని పెంచే బొమ్మలను పనికిరావనుకున్న వస్తువులతో చేశారని చెప్పిన విషయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. 'రాతి కట్టుబడి' లో రాళ్ళతో ఏర్పరిచిన రకరకాల ఆకృతులను బొమ్మలతో అందించిన తీరు బాగుంది.

కార్తికేయ, ఏలూరు

ఆలోచన మారాలి

తగిన మర్యాదలు చేయలేదనీ, లాంఛనాలు సరిపోలేదనీ నిశ్చయించుకున్న పెళ్ళిని కూడా రద్దు చేసుకోవడం మగ పెళ్లివారికి గొప్పగా అనిపిస్తుంది. పెళ్లి సంబంధం తప్పిపోతే అది ఆడపెళ్లివారికే కాదు మగపెళ్ళివారికీ అవమానమే అనే స్పృహ కల్పించే 'మార్పు' కథ బాగుంది. డబ్బుకు ఆశపడి బంధాలను దూరం చేసుకునేవారి ఆలోచనలు ఇప్పటికైనా మారాలి. తమ కుటుంబాలనే కాక పరిసరాలనూ మార్చగలిగిన ఒడిషా ధీర మహిళల గురించి తెలిపిన వివరాలు మమ్మల్ని శుభ్రత వైపు అడుగులేయించాయి. శ్వేత బౌద్ధాలయంలో అందించిన విషయాలు మాకు థాయిలాండ్ చుట్టొచ్చిన అనుభూతిని కలిగించాయి.

లీలా అనసూయ, ప్రొద్దుటూరు

అలుపెరగని పోరాటం

ఈ వారం వింటర్ స్టార్ ద్వారా భారత్‌లో ల్యూజ్ అనే క్రీడ వుందనీ ప్రభుత్వ పట్టించుకోకపోయినా శివకేశవన్ ఈ క్రీడలో కనబరిచిన ప్రతిభను చక్కగా వివరించారు. ఈ వారం స్నేహలో ప్రచురించిన అలనాటి నటి గిరిజపై కథనం బాగుంది. తెలుగింటి లోగిళ్ళలో కనిపించే ముచ్చటైన ముగ్గుల్లో దాగున్న సైన్సు విషయాలను, వివిధ ప్రాంతాల్లో రంగోలీలో వాడే వస్తువుల గురించి ఈ వారం తెలుసుకోగలిగాం.

బుచ్చిబాబు, కడప

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

పజిల్ ప్రపంచం

కవర్ స్టోరీ — 6



కాకికి కుండలో అడుగంటిన నీళ్ళు ఎలా తాగాలో పజిల్. న్యూటన్‌కు చెట్టు మీది యాపిల్ కింద ఎందుకు పడుతుందో పజిల్. చిన్నారికి అమ్మ బొజ్జలోనున్న మరో బుడ్డోడి కథ ఏమిటో పజిల్. పెద్దోళ్లకు గడుగ్గాయిలు మాట్లాడే భాష పజిల్. మనమంతా పజిల్ ప్రపంచంలో పడి మేజిక్‌ల వెనుకున్న లాజిక్‌లు ఆలోచిస్తున్నాం. అలా కుట్టు మిషన్ సూది నుంచి విశ్వాంతరాళ వరకు ప్రతి పజిల్ విప్పుతూ మోస్ట్ ఇంటెల్లిజెంట్ యానిమల్స్ అయిపోయాం. భూమికి హీరోని, విలన్‌ను చేసిన ఈ పజిల్ పరిష్కారాలతోనే ముందుకు సాగిపోతున్నాం.

స్ఫూర్తి 3
'సర్వంచ్‌గా చేయలేననుకున్నారు'

యువ 4
కళ్ళు.. ఓ కలికితురాయి

కార్టూన్ పంచ్ 5

నవ్వుల్ - పువ్వుల్ 10

స్టార్ 11
కొంచెం నీరు.. కొంచెం నిప్పు

సినిమా కబుర్లు 14
'నట'రాజం

వింతలోకం 16
మేఘాల్లో సర్ఫింగ్

కవిత్వం 17
ఆచూకీ దొరకలేదు

కథ 18
తరం మారింది

రుచి 21
ఎగ్‌తో ఎక్స్‌ట్రాగా..

బాల నేస్తాలు 22
స్కేట్ క్రింగ్

ప్రత్యేకం 24
నిశ్శబ్ద పట్టు

చూద్దామా -12
అరవిరిసిన అందం.. కోహిమా



ఒకప్పుడు ఆమె ఓ మామూలు పల్లెటూరి మహిళ, ముగ్గురు పిల్లలతో తల్లిగా, ఇల్లు వాకిలి తీర్చిదిద్దుకోవడమే దినచర్యగా వుండేది. ఆమెతో సహా ఎవ్వరూ ఊహించని విధంగా ఆమె దైనందిన కార్యకలాపాలు మారిపోయాయి. ఊరందరికీ మంచి నీటి సమస్యను తీర్చడమెలా? మరుగుదొడ్లు, వంతెనలు నిర్మించడమెలా? లాంటి ఆలోచనలు, పనులతో బిజీ అయిపోయింది. ఆమె మధ్యప్రదేశ్‌లోని ఖిల్ ఖాండ్వీ గ్రామ తొలి మహిళ సర్పంచ్‌గా ఎన్నికైన వందన బహదూర్. ఓ సాధారణ గృహిణి నుంచి గ్రామ పెద్దగా ఎలా ఎదిగిందో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

'సర్పంచ్‌గా చేయలేననుకున్నారు'

- నాకు మొదటి నుంచి ఊరి కోసం ఏదో ఒకటి చేయాలన్న తపన వుండేది. సర్పంచ్ ఎన్నికల్లో నేను పోటీ చేసినప్పుడు నా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన వారే ఎక్కువ. పంచాయతీని ఓ మహిళ నడపగలదన్న విషయాన్ని వారు నమ్మలేకపోయారు. ఆఖరికి మా బంధువులు కూడా ఎన్నికల్లో నాకు అనుకూలంగా లేరు. నా భర్త పంచాయతీ సభ్యుడిగా వుండడంతో చాలా మంది ఒకటే అభిప్రాయపడ్డారు. భర్త కంటే ఉన్నత పదవిని భార్య ఎలా నడుపుతుంది అనడిగారు.
- నా గ్రామ ప్రజల కోసం నేను చేయగలిగినంతలో ఎంతో కొంత మేలు చేయాలన్నదే నా లక్ష్యంగా వుండేది. గ్రామంలో చదువు కోసం ఏదైనా చెయ్యాలనుకున్నాను. అదృష్టవశాత్తు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించే అవకాశం కలిగింది. ప్రజల మేలు కోసం పనిచేసే అవకాశం లభించింది.
- చివరికి సర్పంచ్‌గా పోటీకి నిలబడినప్పుడు ఓ మహిళ సర్పంచ్ కాగలదన్న విశ్వాసం నాకు కూడా లేదు. గ్రామస్తులు సైతం సర్పంచ్ కుర్చీలో మహిళ కూర్చుని బాధ్యతలు నిర్వర్తించగలదని ఊహించలేకపోయారు. అయితే నా భర్త సహకారంతో పోటీలో నిలబడ్డా ఊరి బాగు కోసం నాకున్న ఆలోచనలను వారి ముందుంచా. చివరికి అందరు కలిపి మంచి మెజారిటీతో నన్ను గెలిపించారు. సర్పంచ్‌గా ప్రారంభంలో నాకు చాలా సమస్యలు ఎదురయ్యాయి. పంచాయతీ సభ్యులుగా ఉన్న పురుషులు మొదట్లో నేను ఏ నిర్ణయం తీసుకున్నా వ్యతిరేకించేవారు. పైగా నాకు ప్రభుత్వ పథకాల గురించి నా విధి నిర్వహణ, బాధ్యతల గురించి పెద్దగా తెలిసేది కాదు. తర్వాత వీటి గురించి పట్టుదలతో తెలుసుకుని పనిచేయడం మొదలుపెట్టాను.
- ఊళ్లో బావుల తవ్వకం, రోడ్ల నిర్మాణం, మరుగు దొడ్ల ఏర్పాటు వంటి అత్యవసరమైన అనేక పనుల మీదనే దృష్టి కేంద్రీకరించేదాన్ని. ఇవి కాక చెరువు తవ్వకం, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు చేయాలని తపించాను. చదువు ప్రాధాన్యత, ఇళ్లలో మరుగుదొడ్ల ఆవశ్యకత, పరిశుభ్రత ప్రాధాన్యతను గ్రామ సభ సమావేశాల్లో చెప్పడం ప్రారంభించాను. దాంతో ప్రజల్లో సైతం పెద్ద మార్పు వచ్చింది. తమ అవసరాల కోసం ప్రభుత్వ పథకాలను ఎలా ఉపయోగించుకోవాలో అడగసాగారు. ఇది నేను సాధించిన పెద్ద విజయం అనుకోవాలి.
- ఆత్మ విశ్వాసంతో మనసు చెప్పినట్టు నడుచుకోమని ఆడపిల్లలకు మహిళలకు చెప్పాను. పితృస్వామ్య సమాజంలో మీరు చేసిన ప్రతి పనికి వ్యతిరేకత వస్తుంది. వారి విమర్శలు, వ్యంగాస్త్రాలు సర్వసాధారణంగా వుంటాయి. అయితే చిట్ట చివరికి మీ లక్ష్యాన్ని చేరుకోవాల్సింది మాత్రం మీరే. ఒకసారి కనుక మీరు విజయం సాధించారో ప్రతి ఒక్కరు మీ కృషిని అభినందిస్తారు. అందుకే మీ పని మీదే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాలి. అయితే మనం చేసే పనుల పట్ల మన ఆలోచనలు, ప్రణాళికల పట్ల పూర్తి స్పష్టత వుండాలి. మన పనుల గురించి ఇతరులను విమర్శించనిద్దాం. ఎందుకంటే విజయం సాధించినప్పుడు వారు తప్పక మనల్ని అభినందిస్తారు.

కల్కి సుబ్రహ్మణ్యన్ ఓ పత్రిక సంపాదకురాలు, రచయిత్రి, నటి, దర్శకురాలు, సామాజిక కార్యకర్త, ఉద్యమకారిణి మరీ ముఖ్యంగా ఓ ఎంట్రిప్రెన్యుర్. ఈ పరిచయంతో చాలామందే ఉన్నారు కదా మరి కల్కియే ఎందుకు? కల్కి ఓ హిజ్రా. 'సహోదరి'గా తోటి హిజ్రాల సాధికారత కోసం కృషి చేస్తున్న 'సూపర్ ఉమెన్'. చీత్కారాలు, వెకిలి చేష్టల గుర్తులు అడుగంటి తానున్న సమాజం గర్వపడే స్థాయికి స్వయం శక్తితో ఎదిగి తనలాంటి వారికి శక్తి కేంద్రంగా మారిన లీడర్. సమాజంలో సాటి వ్యక్తిగానే కాదు పెళ్లికి పూర్తి అర్హులమని బలంగా ప్రపంచవేదికలపై చెప్పే కల్కి గమనం, గమ్యం అంతా ట్రాన్స్‌జెండర్ల ఉద్యమంలోనే.

కల్కి ... ఓ కలికితురాయి!

తమిళనాడులోని పోలాచ్చి కల్కి పుట్టిన ఊరు. ఇద్దరు అక్కలతో కలివిడిగా ఆటపాటల్లో రోజులు తెలీకుండానే గడిచిపోయాయి. తాను సరదాగా అక్కయ్యల గౌన్లు వేసుకుని నటించడంలేదని అదే తన నిజ స్వభావమని ఎనిమిదేళ్లు నిండాక గానీ తెలీలేదు. ఆ విషయాన్ని ఎవరికి చెప్పాలో తెలీక కవితల్లో తన స్త్రీత్వాన్ని వ్యక్తం చేసేది. ఈ కవితల్నే వాళ్లమ్మ చూసి షాక్‌కు గురైంది. ఓ మానసిక వైద్యుడికి చూపిస్తే కల్కి మనసు వంద శాతం ఆడపిల్లదని తేల్చేశాడు. కేవలం అబ్బాయిలుండే బోర్డింగ్ స్కూల్‌లో వేస్తే తీరు మారుతుందేమోనని ప్రయత్నించారు. కానీ తోటి విద్యార్థుల నిత్య వేధింపులు, ఆఖరకు ఉపాధ్యాయుల నుంచి కూడా వెక్కిరింతలు. తట్టుకోలేకపోయేది. పక్కనే ఉన్న పార్కులో తలదాచుకునేది అక్కడే అప్సర అనే హిజ్రాతో పరిచయమైంది. ఆ పరిచయం ఓ కొత్త కుటుంబాన్ని అందించింది. అక్కడంతా తనలాంటి వారే. 'తిరునంగై' అనే ఆ కుటుంబం వందేళ్ల నుంచి కొనసాగుతోంది. అప్పటికే ఉన్నవాళ్లు తల్లులు, కొత్తగా వచ్చేవాళ్లు కూతుళ్లు. అక్కున చేర్చుకున్న ఆ పెద్ద కుటుంబం కల్కి సంశయాల్ని తరిమేసి తన పురుషుడి దేహంలో బంధీ అయిన స్త్రీని పూర్తిగా బయటపడేశాయి. కల్కిని తల్లిదండ్రులు అర్థం చేసుకున్నారు. ఈ సున్నిత విషయంలో కల్కికి అండగా నిలిచారు.

సహోదరిగా...

చదువును వదలొద్దని అదే శాశ్వతమైన ఐడెంటిటీ అనే తల్లి మాటతో కల్కి బీ.ఏ. ఇంగ్లిష్ చేశాక మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసింది. అదే ఎందుకంటే తనకో ఆశయం ఉంది హిజ్రాల సమస్యలేంటో సమాజానికి లోతుగా విశ్లేషించాలి. 'సహోదరి' అనే పత్రిక నడిపింది. మాస్టర్స్ అయ్యాక ఓ బహుళజాతి సంస్థలో మీడియా స్పెషలిస్ట్‌గా పనిచేసింది. తనలా ఉద్యోగిలా అవ్వకుండా భిక్షాటన, దౌర్జన్యం అనేది సమాజమే హిజ్రాలకు ప్రత్యామ్నాయం చేసిందనేది ఆమె వాదన. అదే నిజం కూడా. చెన్నైలో శస్త్రచికిత్స తర్వాత పూర్తి స్త్రీగా మారిపోయిన కల్కి 2005లో ఉద్యోగాన్ని విడిచి 'సహోదరి' సేవాసంస్థను ప్రారంభించింది. ఆర్థికంగా తనతో పాటు మిగతా హిజ్రాలు నిలదొక్కుకునేందుకు కల్కి బ్రాండ్ పేరిట సంగీత పరికరాల తయారీని మొదలెట్టింది. ఆన్‌లైన్ అమ్మకాలు ప్రారంభించింది. పెనెక్టమీ, లింగమార్పిడి చికిత్సలు, హెచ్ఐవీ, సెక్స్ అబ్యూజ్, సబ్‌స్టెన్స్ అబ్యూజ్, పోలీస్ వేధింపులు వంటి ఎన్నో సమస్యలపై పోరాడుతూ వివిధ సామాజిక మాధ్యమాల్ని విస్తారంగా ఉపయోగించుకుంది. ఆరోవిల్లే అంతర్జాతీయ గ్రామంలో పలు కార్యక్రమాల అనంతరం చెన్నైకి వచ్చి మరికొందరు హిజ్రా ఉద్యమకారిణిలతో కలసి హక్కుల కోసం పోరాడింది. తమిళనాడు ప్రభుత్వం హిజ్రాల సాధికారత బోర్డును ఏర్పాటు చేసి, వైద్యుల ప్యానెల్‌ను ఎంపిక చేసి శస్త్రచికిత్సలకు నిధిని అందించింది. ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేసి రేషన్ ఇచ్చింది. ఇదో పెద్ద ముందడుగు. అక్కడితో కల్కి ఆగిపోలేదు. 2014లో సుప్రీం కోర్టు ట్రాన్స్‌జెండర్లను చట్టబద్ధంగా గుర్తించాలన్న తీర్పు



వెనుక ఉద్యమంలో కీలకంగాను పనిచేసింది. హిజ్రాల వివాహాలు జరిపించేందుకు తిరునంగై పేరిట మేట్రిమోనిని ప్రారంభించింది. బటర్‌ఫ్లైస్ ప్రాజెక్ట్ ద్వారా ఆభరణాల తయారీలో హిజ్రాలను భాగస్వాములను చేసి స్టాళ్లు పెట్టించింది. అంతర్జాతీయ సంబంధాలపై మరో మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేసింది. ఆసియా నుంచి అమెరికా ప్రభుత్వం ఆహ్వానం అందుకున్న తొలి ట్రాన్స్‌జెండర్ కల్కి. 2010లో ఇంటర్నేషనల్ విజిటర్స్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌కు అతిథిగా వెళ్లి వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, సాల్ట్ లేక్ సిటీల్లో 16 రోజుల కార్యక్రమాల్లో పాల్గొని అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. బీబీసీ వంటి సంస్థలకు ఇంటర్వ్యూలు ఇచ్చింది. దేశం వచ్చాక ఐఐటీ మద్రాస్, జిందాల్ గ్లోబల్ లా స్కూల్, నేషనల్ జ్యుడిషియరీ అకాడెమీ, గౌహతీ విశ్వవిద్యాలయం, సెట్ త్రివేండ్రం, న్యూఢిల్లీ శ్రీరామ్ వంటి అనేక మేధా వేదికల్లో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలిచ్చింది. 2012లో అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అల్తామస్ కబీర్ ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందుకుంది. 'నర్తకి' అనే తమిళ సినిమాలోను కల్కి లీడ్ రోల్‌లో నటించింది. నటనకు గాను విశేష పురస్కారాలెన్నింటినో అందుకుంది.

ఒకప్పుడు కల్కికి ఓ కల ఉండేది. తాను ఎంతగానో ఇష్టపడే నటి సుహాసినిని ఇంటర్వ్యూ చేయాలని. 'నర్తకి' కీర్తితో సుహాసినియే ఓ షోలో కల్కిని ఇంటర్వ్యూ చేసింది. బలమైన ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని నడిపిస్తే ఇలాంటి అద్భుతాలే జరుగుతాయని చెబుతుంది. ఆమె రచించిన 'కురి అరుతియన్' అనే పుస్తకాన్ని పేరుమోసిన వికటన్ పబ్లిషర్స్ ప్రచురించింది. బ్లాగ్‌ను కూడా నడుపుతోంది. కేరళ, చత్తీస్‌ఘడ్‌ల్లోను ఆమె కార్యకలాపాలు విస్తరించాయి. అంతర్జాతీయ నేతగా గుర్తింపు ఉంది. కల్కి లాంటి హిజ్రా ఉద్యమకారిణుల వల్ల ఇప్పుడిప్పుడే సమాజంలో వారి స్టేటస్ మారుతోంది.


విద్యార్థుల బహిష్కరణ

ఆహా.. ఏమి ఆతిథ్యం!!
అనుమానితుల్ని అరెస్ట్ చేసాం పాక్


నీకు స్థలం ఇవ్వకుండా.. ఉంటానా!!
రైతాంగ భూమి
రైతులకు రాజధాని ప్రాంతంలో స్థలాలు లేనట్లే
రాజధాని ప్రాంతం

కార్టూన్

పంచ్


జీవో.279
పారిశుద్ధ్య కార్మికుల పొట్టకొడుతున్న జీవో-279

కాకికి కుండలో అడుగంటిన నీళ్లు ఎలా తాగాలో పజిల్. న్యూటన్‌కు చెట్టు మీది యాపిల్ కింద ఎందుకు పడుతుందో పజిల్. చిన్నారికి అమ్మ బొజ్జలోనున్న మరో బుడ్డోడి కథ ఏమిటో పజిల్. పెద్దోళ్లకు గడుగ్గాయిలు మాట్లాడే భాష పజిల్. మనమంతా పజిల్ ప్రపంచంలో పడి మేజిక్‌ల వెనుకున్న లాజిక్‌లు ఆలోచిస్తున్నాం. అలా కుట్టు మిషన్ సూది నుంచి విశ్వాంతరాళ వరకు ప్రతి పజిల్ విప్పుతూ మోస్ట్ ఇంటెల్లిజెంట్ యానిమల్స్ అయిపోయాం. భూమికి హీరోని, విలన్‌ను చేసిన ఈ పజిల్ పరిష్కారాలతోనే ముందుకు సాగిపోతున్నాం. అందుకే సరదాగా దీనికీ ఓ రోజు (జనవరి 29) పెట్టుకుని మరీ మరో రెండు పజిళ్లను ఆడేస్తున్నారు. ప్రహేళికల ప్రస్థానమే ఈ వారం అట్ట మీది కథ.



అట్టమీది కథ

పజిల్ ప్రపంచం

అజయ్ కుమార్ వారాల
9502395077

మనకు తెనాలి రామలింగని కథలు ఎన్నో తెలుసు. సూది మొనలో ఏనుగును దూర్చిన ఆయన పద్య చమత్కారాల్లోని పజిల్స్ విప్పేందుకు శ్రీ కృష్ణదేవరాయని ఆస్థానంలో మహా మహా పండితులు కిందామీదా అయ్యేవారు. వీటినే ప్రహేళికలు అంటారు. అంతకు ముందు నుంచీ ఉన్న ప్రాచీన భారతీయ గ్రంథాల్లో ఇవెన్నో తారస పడతాయి. దీనికి మంచి ఉదాహరణ. మహా భారత రచన మీద ఉన్న ఓ కథ. అన్ని అంశాలను కూర్చి అందంగా పేర్చి రాయాల్సిన ఆ ఉద్గ్రంథాన్ని తానే ఆలోచిస్తూ రాయలేనని వ్యాసుడు పజిల్లో పడ్డాడు. వెంటనే వెళ్లి రాత సాయం చేయాలని వినాయకుడిని అడిగాడు. దానికి గణేషుడు 'నా రాత ఆగకుండా నువ్వు చెబుతూనే ఉండాలి' అని ఓ షరతు పెడతాడు. అదెలా సాధ్యం ఏకబిగిన అంత గ్రంథాన్ని ఎలా చెప్పగలమనే దాని గురించి బాగా ఆలోచించిన వ్యాసుడు వినాయకుడికి ఓ విన్నపం చేసుకుంటాడు. 'చెప్పింది పూర్తిగా అర్థమయ్యాకే రాత సాగించాలి' అని. అలా పజిల్స్‌ను మధ్య మధ్యలో వేసి వాటి గుట్టు విప్పడానికి వినాయకుడు సమయం తీసుకుంటున్న సందర్భంలో తర్వాతి కథను ఆలోచించి నేరేట్ చేశాడట వ్యాసుడు. ఇది ఎంతవరకు నిజమో తెలీదు కానీ ఈ తరహా పజిల్ ఆటలు ఎప్పటి నుంచో ఉన్నాయనే విషయం దీని ద్వారా తెలుస్తుంది. ఆ ప్రహేళికలే ఉద్భుత శ్లోకాలుగా, శాస్త్రాలుగా, పొడుపు కథల్లా రూపాంతరం చెంది అటు వినోదాన్ని అందిస్తూనే ఇటు బుర్రకు పదును పెట్టాయి. పెళ్లపుడు వధూవరుల్ని ముప్పు తిప్పలు పెట్టే పజిల్ ఆటలు ఎంత సరదాగా సాగిపోయేవో ఒకప్పుడు. అల్లరి పిడుగుల ఆట కట్టించేందుకు మాస్టారికి కూడా ఇవే బెత్తాలయ్యేవి. విత్తు ఒత్తితే వృక్షమౌతుందన్న విషయం కూడా భూమిని చీల్చుకుంటూ మొక్క ఎలా మొలుస్తుందనే పజిల్ గురించి తటాపటాయిస్తే గానీ తెలిసిరాలేదు. అంతే అడవుల నుంచి మనం బయట పడటానికి ఆ పజిలే ప్రాణం పోసింది. భూమి ఓ టేబుల్‌లా ఉంటే సముద్రం నీరంతా అంతరిక్షంలోకి జారిపోవాలి కదా. అలా ఎందుకు జరగడం లేదనే పజిల్ సమస్య వీడి భూమి గుండ్రంగా ఉండొచ్చనే విషయాన్ని విథౌట్ శాటిలైట్లతో తేల్చేశారు పూర్వీకులు. లియోనార్డో డావిన్సీ లాంటి మేధావులు, నికోలాస్ టెస్లా లాంటి శాస్త్రవేత్తలు గుట్టుగా పజిళ్ల రూపంలో వారి సిద్ధాంతాలను, పరిశోధనాంశాలను రహస్యంగా దాచిపెట్టుకునేవారట. యుద్ధ నేర్పులు పెంచే చదరంగం కూడా ఓ పజిల్ ఆటే. నిధుల్ని దాచేందుకు, శత్రువు కన్నుగప్పి రహస్యాలు చేరవేసేందుకు ఉపయోగించిన మార్గాలు, గుప్త ప్రాంతాలు, మ్యాపులు అన్నీ కూడా పజిల్సే. భూమి పొరల్లో కలిసిపోయిన చరిత్ర గుర్తులన్నింటినీ ఓ పజిల్ ఆటలానే విప్పగలిగారు. పిరమిడ్స్ నుంచి గండికోట రహస్యం వరకు అంతా పజిల్ ఆటలే.

జిగ్‌సా చేశారా

చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించిన చిత్రాన్ని తిరిగి సరిగ్గా అతికించడమే జిగ్ సా పజిల్. వినడానికి చాలా తేలిగ్గా అనిపించినా పూర్తి చేయడానికి మాత్రం కాస్త బుర్ర షార్ప్‌గా పనిచేయాలి. ముక్కల్ని చక్కగా నలు చదురంగా కత్తిరించి పడేయరు. వివిధ ఆకృతుల్లో వాటిని కత్తిరిస్తారు. సరిగ్గా దానికి అనుసంధానమయ్యే ముక్కను ఏరడానికి, కూర్చడానికి పెద్ద కసరత్తే చేయాలి. ఈ ముక్కలు సాధారణంగా 1000 వరకు ఉంటాయి. వయసు, మేధో వికాసాలను బట్టి ఆ సంఖ్య అటూ ఇటూ అవ్వొచ్చు. కుటుంబం, స్నేహితులు కలిసి ఆడేలా 3000, 5000 ముక్కలతో కూడా సెట్లు దొరుకుతాయి. ఇవీ చవగ్గా లభ్యమవుతాయి. ప్రసిద్ధమైన పెయింటింగ్‌లు, కట్టడాలు, వ్యక్తులు, ప్రకృతి దృశ్యాలు, చారిత్రక ఘటనలు ఇలా ఏదో ఒక చిత్రాన్ని తీసుకుంటారు. జిగ్‌సా పజిల్‌ను 1760లో ఇంగ్లండ్‌కు చెందిన జాన్ స్పిల్స్‌బర్గ్ అందించాడు. మ్యాపుల్ని, గ్లోబ్‌ల్ని రూపొందించే జాన్‌కు పిల్లలకు తేలిగ్గా అర్థమై, గుర్తుంచుకునేందుకు మ్యాప్‌తో ఏదైనా ఓ ఆట తయారు చేస్తే బాగుండనిపించింది. చెక్కతో చేసిన ఓ మ్యాపును పరీక్షగా చూసిన ఆయనకు ఓ ఆలోచన తట్టింది. దేశాల సరిహద్దుల దగ్గర కత్తిరించి వాటిని తిరిగి జోడించాడు. ఇది అప్పటి భౌగోళిక శాస్త్ర ఉపాధ్యాయులకు పెద్ద మేలు చేసింది. అప్పటి నుంచి వివిధ రూపాల్లో వినోదంగాను ఈ పజిల్ ప్రపంచాన్ని చుట్టేసింది. పెద్దోళ్ల బుర్రకు కూడా బోలెడు పని కల్పించే ఈ జిగ్‌సా పజిల్‌లో అతి పెద్దదాన్ని జర్మనీకి చెందిన రావెన్స్‌బెర్గర్ కంపెనీ తయారుచేసింది. మొత్తం 32 వేల 256 ముక్కలతో ప్రఖ్యాత అమెరికన్ చిత్రకారుడు కీత్ హారింగ్ వేసిన 32 వర్ణచిత్రాల్ని ఓ వరస క్రమంలో ఈ పజిల్‌లో పొందుపరిచారు. ఈ పజిల్ దినోత్సవం సందర్భంగా ఓ గ్రూప్ 13 లక్షల 63 వేల 159 ముక్కలతో ఆన్‌లైన్‌లో ఓ పెద్ద జిగ్ సా పజిల్ పోటీలో మునిగిపోయింది. 42 దేశాలకు చెందిన 523 మంది గేమర్లు ఈ పజిల్‌ను పరిష్కరించే పనిలో పడ్డారు. జిగ్‌సా ఎంత పాపులరైందంటే నెట్టింట్లో భారీ సమాచారాన్ని అందజేసే వికీపీడియా లోగో కూడా జిగ్ సా ముక్కలతో జతచేసినట్టుండే గ్లోబ్ చిత్రమే. మానసిక దౌర్బల్యానికి, ఎదుగుదల లోపానికి కారణమయ్యే ఆటిజమ్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు వాడే దాని రిబ్బన్ కూడా జిగ్‌సా ముక్కల అతికింపే.

పజిల్ ఆడేశాయి..

ఇలా చెప్పుకుంటూ పోతే పజిల్‌ల సాయమంతా ఇంతా కాదు. పులి–మేక ఆట అదే కదా. పులి మింగకుండా అడ్డుకోవడమో పెద్ద పజిల్. ఓ దారాన్ని తీసుకుని రెండు అరచేతుల్లో అల్లేసి పక్కోడి చేయి పెట్టమని.. వాడి చేయి చిక్కుకోకుండా చట్టుక్కున దారాన్ని లాగేయడం చిన్నారుల ఫేవరెట్ పజిల్ ఆట. ఇక రూబిక్స్ క్యూబ్‌లు, చిన్న గీత–పెద్ద గీత ఆటలు ఇలా ఎన్నో పజిల్‌ల గుట్టు ఎప్పుడో విప్పేసినా ఎప్పటికప్పుడు కొత్త వారిని ఆలోచనలో పడేసి దాన్ని విప్పేంత వరకు మరే ఆలోచన లేకుండా ఆ పజిళ్ల ప్రపంచంలోకి లాగేస్తాయి. సరదా ఆటల నుంచి జీవిత లక్ష్యాలకు చేర్చే ఇంటర్వ్యూల వరకు ప్రతి చోట పజిల్ ప్రత్యక్షమై మనల్ని పరీక్షిస్తూనే ఉంటుంది. గణిత, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో పజిల్స్‌దే ప్రాధాన్యం. వాటి చిక్కుముళ్లు విప్పడానికి వాటిని ఆటల రూపంలో ప్రయత్నించిన సందర్భాలు అనేకం. చింపాంజీలకే వచ్చే ఓ రకం వైరస్ ప్రొటీన్‌ను ఛేదించేందుకు జీవ శాస్త్రవేత్తలు ఓ కిటుకు ప్రయత్నించారు. దాని నిర్మాణాన్ని ఓ బ్లాక్ వీడియోగేమ్‌గా రూపొందించారు. దాన్ని వీర గేమర్ల చేతికి అందిస్తే వారు ఊహించనంత తక్కువ కాలంలో గేమ్ ఫినిష్ చేసి ఇచ్చారు. ఇంతకీ వారు చేసింది ఆ వైరస్‌ను అంతమొందించే ప్రొటీన్ ఛేదనకు బ్లూ ప్రింట్. దాని ద్వారానే యాంటీ వైరస్‌ను రూపొందించారు. ఐక్యూను కొలిచేందుకు కూడా ఈ పజిల్ ఆటల మీదే ఆధారపడతారు. మింగుడు పడని గణిత సమీకరణాలను కూడా పజిల్ ఆటల ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మూలకాల పట్టికలోకి కొత్తగా చేరే వాటికి ఈ పజిల్ ఆటే స్థానం కల్పిస్తోంది. వినోదానికి, శాస్త్రానికే కాదు మానసిక చికిత్సకు కూడా పజిల్ ఆటలు పనికి వస్తాయి. నిర్బంధంలోనో, సుదూర ఒంటరి ప్రయాణాల్లోనో విసిగిపోయి పిచ్చి వాళ్లు కాకుండా మనిషికి తోడుగా నిలిచినవి పజిల్సే. వాటి గుట్టు విప్పుతూ సమయాన్ని దొర్లించేసి ఒంటరితనం నుంచి బయటపడిన వారెందరో. చరిత్రలో పెను మలుపుల్ని చవిచూసిన చాలా ఘట్టాల్లో ఈ ప్రస్తావనలు కనిపిస్తాయి. ఒంటరితనంలోంచి బయటపడేయడమే కాదు ఏకాంతంలోకి నెట్టేస్తాయివి.

బుర్రకు చికిత్స

అల్జీమర్స్ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచి పజిల్స్ బాగా ఆడాలని కెనడా ఆరోగ్య సంస్థే చెప్పింది. మెదడులోని గ్రే మేటర్‌ను పెంచి, అల్జీమర్స్‌కు సూచన అయిన ప్లేక్స్ తయారీని తగ్గించి గొప్ప సాయమే చేస్తాయి పజిల్స్. అయితే పజిల్ ఆటల్ని కొనసాగిస్తూనే ఉండాలి. మెమరీ లాస్ (మతి మరుపు), రీ కాల్ (పునర్జప్తి) సమస్యలకు మంచి మందు పజిల్ ఆటలు. పజిల్స్ ఆడుతుంటే మెదడును జిమ్‌కు తీసుకెళ్లినట్టే. ఎంత ఆడితే అంత ఆరోగ్యం. మన ఏకాగ్రతను పెంచి, పరిష్కారం కోసం పరిపరి విధాలా ఆలోచన శక్తిని పెంపొందించి, గుట్టు విప్పాక అంతులేని ఆనందాన్ని అందించి ఓ సమన్వయాన్ని తీసుకొస్తాయి పజిల్స్.

అదో ధ్యానం లాంటిది. మిగతా విషయాలతో బుర్ర అస్తవ్యస్తం కాకుండా ఒక్క విషయంపైనే దృష్టి నిలిపేలా చేసి ఆందోళనను తగ్గిస్తుంది. మనసు చిరాకుగా అనిపిస్తే ఓ పజిల్ ఆటను ముందేసుకుని కూర్చోండి. మీకు తెలీకుండానే దానిలో పడి మిగతా సమస్య లన్నింటినీ కాసేపు మర్చిపోతారు. హాయిగా సేద తీరుతారు. అయితే ఈ పజిల్‌లు మరీ తేలిగ్గా ఉండకూడదు. మరీ కష్టసాధ్యమూ కాకూడదు. వారి వారి సామర్థ్యాలను, సమయాన్ని బట్టి ఆటల్ని ఎంచుకుంటే మంచిది. ఇదంతా ఎలా సాధ్యమంటే మనిషికి గెలుపు ఓ పెద్ద ప్రేరణా బలం. చిన్న చిన్న విజయాలు కూడా జీవితంలో గొప్ప మార్పులకు బీజాలు వేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఓ పాజిటివ్ దృక్పథాన్ని అలవరుస్తాయి. మనవన్నీ భారీ లక్ష్యాలు, సుదీర్ఘ ప్రయత్నాలు కాబట్టి గెలుపు రుచి అట్టే దొరకదు. ఈ పజిల్ ఆటల్లో దాని రుచి బుర్రకు, మనసుకు తగులుతూనే ఉంటుంది కనుక విజయం మజా రంజుగా పొందొచ్చు. పదకేళీలు కానీవ్వండి, క్యూబ్‌లు కానీవ్వండి, జిగ్‌సా పజిల్‌లు కానీవ్వండి లేదా పొడుపు కథలు కానీవ్వండి వాటి గుట్టు విప్పేటపుడు కలిగే సంతోషంలో చిన్నారులతో పోటీపడతాం.

బోధనే కాదు వినోదమూ...

బోధనా పద్ధతుల్లో గొప్ప విప్లవాన్నే తీసుకొచ్చాయి ఈ పజిల్ ఆటలు. అప్పుడప్పుడే తప్పటడుగులు వేసే దశ నుంచి కౌమారం వీడిపోయేంత వరకు వివిధ వయస్సులకు తగిన విధంగా చాలా పజిల్ ఆటల్ని రూపొందించారు. వీటిని ప్రధాన విద్యతో సమాంతరంగా ఆడిస్తే మిగతా పాఠ్యాంశాల్లోను ప్రతిభ పెరుగుతుందని అనేక పరిశోధనల్లో తేలింది. కొన్ని విద్యాసంస్థలు వీటిని కోర్సు కరిక్యులమ్‌లో జోడించేశాయి. ఇంట్లోను వాటిని ఆడించేందుకు మార్కెట్లో బోలెడు పజిల్స్ దొరుకుతుంటాయి. వాటి మీద వయస్సును కూడా సూచిస్తారు. అయితే కొందరు గడుగ్గాయలకు వయసుకు మించి తెలివితేటలు ఉంటాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని ఓ పజిల్ ముందుకేయాలి. మరీ తేలిగ్గా ఉంటే పిల్లలకు బోర్ కొట్టేసి పూర్తిగా విడిచిపెట్టేస్తారు. బొమ్మల రూపంలో ఉన్నవాటిని వీలైతే సొంతగా ఇంట్లో పాత వస్తువుల్ని ఉపయోగించి చేయడానికి ప్రయత్నిస్తే ఖర్చు కలిసొస్తుంది. వాటి తయారీలో చిన్నారుల్ని భాగస్వాములను చేస్తే మరింత ఆసక్తి పెరుగుతుంది. పదకేళీలు భాష పటిమను పెంచడంతో పాటు పదాల బ్యాంకును ఏర్పాటుచేస్తుంది. వారి కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచడానికి భాష కూడా ప్రధానమే. క్రాస్ వర్డ్స్ (ఒక పదాన్ని ఉపయోగించి మరో పదాన్ని సాధించడం) ఆంగ్లంపై పట్టు పెంచుతాయి.

వీటిని తొలిసారి పరిచయం చేసింది 19వ శతాబ్దిలో. దిన పత్రికలు, వార పత్రికలు తమ చందాదారుల్ని పెంచుకోవడానికి ఇదో మంచి ఎత్తుగడ అయ్యింది. పదకేళీల్ని టైమ్‌పాస్‌గా పూరించేందుకు ప్రయాణాల్లో దినపత్రికల్ని పట్టుకు కనిపించేవారు. ప్రయాణ బడలిక తెలియపోవడం, సరదాగా ఉండటంతో కేవలం పజిల్స్‌తోనే అచ్చయిన చేతి పుస్తకాలు రూపొందాయి. ఇవన్నీ భాషపరమైన పజిల్స్ అయితే. లాజిక్‌ను అప్లై చేసే అగ్గిపుల్లల పజిల్స్, గీతల పజిల్స్, ఆకారాల పజిల్స్, నిర్మాణాల పజిల్స్ బోలెడు ఉన్నాయి. సమస్య పరిష్కారానికి దారులు వెతకడం ద్వారా మెదడు మరింత చైతన్యం పొంది ఆ పద్ధతిని నిజ జీవితంలోని సందర్భాల్లో ఉపయోగించుకునేలా నిల్వ చేసుకుంటుంది. మానసికంగాను, శారీరకంగాను కసరత్తులా ఉపయోగపడే పజిల్ మేజ్ తోటలు ఉన్నాయి. ఒక్కసారి వాటిలోకి ప్రవేశించాక బయటపడే దారి కనుక్కోవడమే ఆట. ఎటు వెళుతున్నామో తెలీక తిరిగి తిరిగి మళ్లీ అక్కడకే చేరుకోవడం, మరో ప్రయత్నంలో లాజిక్‌ను అప్లై చేసి కొత్త దోవన నడవడం ఇదంతా ఆహ్లాదకరంగాను, ఉద్విగ్నంగాను సాగే ఆట. ఇలాంటి పార్కులు, తోటలు పదుల ఎకరాల్లో విస్తరించినవి కూడా చాలానే ఉన్నాయి.

పజిల్‌లు పది రకాలు

సరదాగాను, సీరియస్‌గాను ఆడుకునేందుకు పలు రకాల పజిల్స్ రూపొందాయి. మనకు బాగా తెలిసిన సుడోకునే కాక కిల్లర్ సుడోకు కూడా ఉంది. దీనిలో క్లూస్‌ను వర్గాలుగా ఇస్తారు. దీనికి గళ్లలోని అంకెల మొత్తాన్ని కూడా కలిపి పూర్తిచేయాలి. ప్రపంచంలోనే అతి కష్టసాధ్యమైన సుడోకు ఫార్మట్‌ను 2012లో ఫిన్‌ల్యాండ్‌కు చెందిన గణితవేత్త ఆర్టో ఇంకాలా రూపొందించాడు. 11 స్టార్లను పొందిందది. సాధారణంగా మనం 3–5 స్టార్ల రేటింగ్ ఉన్న సుడోకును పరిష్కరించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. అలాంటిది 11 స్టార్లంటే మాటలు కాదు. కాలెండోకు అనే మరో సుడోకు లాంటి పజిల్ కూడా ఉంది. దీన్ని తేత్సుయా మియామోటో రూపొందించాడు. జపాన్‌లో దీన్ని కాషికోకు నారు అని కూడా పిలుస్తారు. ఈ పజిల్ ఫార్మట్‌లో కూడికలు, భాగహారాలు, గుణకారాలు, తీసివేతలు ఇలా ఏ గణనైనా చేయొచ్చు. కకురో పజిల్ అనే మరోటి ఉంది. దీనిలో సుడోకుతో పాటు క్రాస్‌వర్డ్స్, లాజిక్ పజిల్‌లు, గణనలు అన్నీ కలిసి ఉంటాయి. దీన్ని ఛేదించడం అంత ఆషామాషి కాదు. '3 గాడ్స్' అనే మరో లాజిక్ పజిల్‌లో క్లిష్టమైనది కూడా మహామహా పజిల్ పరిష్కర్తలను కూడా నీళ్లు తాగిస్తుంది. బాగా పాపులరైన మరో పజిల్ బోన్‌గార్డ్ పజిల్. దీన్ని 1967లో రష్యాకు చెందిన కంప్యూటర్ శాస్త్రవేత్త మిఖైల్ మోయిస్విచ్ బోన్‌గార్డ్ రూపొందించాడు. ఆరు ప్యాటర్న్‌లలో ఉండే పట్టికలోని అంశాల్ని ఎడమ చేతి వైపుగా ఓ పద్ధతిలో పూర్తిచేయాల్సి ఉంటుంది. గో ప్రాబ్లమ్ అనే మరో పజిల్‌ను చైనాలో 2500 ఏళ్ల క్రితం నుంచి ఆడుతున్నారు. గణితంలో మంచి పటిమ ఉన్న మేటి విద్యార్థుల బృందానికి సుమారు 1000 గంటల సమయం పడుతుంది దీన్ని పరిష్కరించాలంటే. విద్యార్థుల ప్రతిభను ఈ పరీక్ష ద్వారానే అంచనా వేసేవారు. అధ్యాపకుడే ఆవిష్కరించిన మరో పాపులర్ పజిల్ 'ఫిల్ ఎ ఫిక్స్'. ట్రెవర్ ట్రూరాన్ అనే బడిపంతులు దీన్ని రూపొందించాడు. ఓ చిత్రాన్ని పిక్సలేట్ చేసి గ్రిడ్‌ల మధ్యకు చేర్చి ఉంచుతారు. గ్రిడ్‌ల మధ్య



సానపట్టే గుట్టు యిదే..

పజిల్స్ న్యూరాన్ కనెక్షన్లను పటిష్టం చేస్తాయి. కొత్త వాటిని అనుసంధానం చేస్తాయి. దీని వల్ల జ్ఞాపక శక్తికి మేలు కలుగుతుంది. ఓ సమస్యకు పరిష్కారం వెదకడానికి కొత్త దారుల్ని వేసుకునేందుకు ప్రయోగాలు, అన్వయాలు, ఊహలు, సాగుతున్న తీరు, ప్రయత్నాలు ఇవన్నీ సృజనాత్మకతను పెంచుతాయి. పజిల్స్‌ను పరిష్కరించడానికి మెదడులోని రెండు పార్శ్వాలు కలిసి పనిచేస్తాయి. దీన్నే 'హోల్ బ్రెయిన్ ఎఫెక్ట్' (సంపూర్ణ మెదడు ప్రభావం) అంటారు. బుర్రకు ఇదో మంచి కసరత్తే కాకుండా సమన్వయ పరిచే ప్రక్రియ. పజిల్ పరిష్కరించే సందర్భంలో న్యూరో ట్రాన్స్‌మిటర్లయిన డోపమైన్ ఉత్పత్తి పెరిగి మెదడుతో మిగతా శరీర భాగాల అనుసంధానం బలపడుతుంది. పజిల్స్ పరిష్కారమైనపుడల్లా డోపమైన్ విడుదలై ఓ పాజిటివ్ మూడ్‌ను కలుగచేస్తుంది. రివార్డు అందుతుందనే భావన కొత్త పజిల్స్ వైపు ఆసక్తి కలిగిస్తుంది. అలా అదో అలవాటుగా మారి మాటిమాటికీ అందే విజయాలతో మెదడు సేద తీరుతుంటుంది. అందుకే కొందరు అదే పనిగా పజిల్స్ పరిష్కరించడానికి ఉత్సాహం చూపుతుంటారు. చూసేవారికి వాళ్లెందుకలా బుర్ర పాడు చేసుకుంటారు అనిపిస్తుంది కానీ నిజానికి ఆ ప్రక్రియలో వారి మెదళ్లు ఎంతో ప్రశాంతతను పొందుతుంటాయి. న్యూరో ప్లాస్టిసిటీ చెప్పేదేమిటంటే ఓ అనుభవం వల్ల మెదడు స్వతహాగా తన న్యూరాన్ కనెక్షన్లను రీమోడల్ చేసుకుంటుంది. పజిల్స్ మానసిక స్టిమ్యులేటర్లలా పనిచేసి మెంటల్ ఫిట్‌నెస్‌ను అందిస్తాయి. వయసు రీత్యా వచ్చే మతిమరుపుకు మందులాను పనిచేస్తాయి. భారీ స్థాయిలో కాగ్నిటివ్ నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో సాయపడి గాయాలు, ఒత్తిడి వల్ల ఎక్కువగా న్యూరాన్ కనెక్షన్లు నష్టపోకుండా కాపాడతాయి. అల్జీమర్స్‌కు మార్కర్‌గా చెప్పే బీటీ అమైలాయిడ్ ప్లేక్స్ ఉత్పత్తిని అడ్డుకునే అవకాశం ఉందని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన హెలెన్ న్యూరో సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధక శాస్త్రవేత్తలు తేల్చారు.

తేడాల ద్వారా రంగుల భేదాల ద్వారా అది ఏ చిత్రం అయి ఉంటుందో గుర్తించాల్సి ఉంటుంది. ఇక్కడ చీకట్లో బాణాలు అస్సలు వేయలేం. ఓ పద్ధతి ప్రకారం బుర్రలో ఊహాచిత్రాన్ని కలుపుకుంటూ పోవాలి. అది ఎక్కడి నుంచి మొదలు పెట్టాలనే దాంట్లోనే అసలు గుట్టు ఉంటుంది. ఇప్పటి

స్మార్ట్ యుగంలో మొబైల్స్, టాబ్లెట్లు, ఫాబ్లెట్లు ఎక్కువవడంతో యాప్‌ల రూపంలోను పజిల్ గేమ్స్ వచ్చేశాయి. వాటిని రూపొందించేది న్యూరో సైంటిస్ట్‌లంటేలా ఆలోచించాల్సిందే. వీడియో గేమింగ్ కంపెనీలు ఈ తరహా గేమ్‌ల రూపకల్పనకు పరిశోధన శాలలు కూడా ఏర్పాటు చేసుకుని శాస్త్రవేత్తల సాయం తీసుకుంటున్నాయి. మనకు బాగా మదిలో మెదిలే టెట్రిస్ వీడియో గేమ్ కూడా అలా పుట్టిందే. నిజానికిది ఓ ప్రాచీన నిర్మాణ పజిల్‌కు స్మార్ట్ రూపాంతరం. దీన్ని రష్యాకు చెందిన గేమ్ డిజైనర్ అలెక్సీ పాజిట్‌నోవ్ ప్రపంచానికి అందజేశాడు. వివిధ ఆకృతుల్లో ఉండే బ్లాక్‌ల్ని (ఇటుకల్లాంటివి) ఖాళీల్లేకుండా ఒకదానిపై ఒకటి కలిపి ఎప్పటికప్పుడు గోడను పూర్తిచేయడమే ఆట. ఇది అక్కడో సాంప్రదాయక ఆటగా ఉండేది. పై నుంచి ఆకృతుల్ని జారవిడుస్తుంటే కింద ఉన్న వారు వాటిని కట్టేస్తూ ఉండాలి. ఇంటెలిజెంట్ క్యూబ్ కూడా ఓ మంచి పజిల్ వీడియో గేమే. భారత్‌లో నిత్యం ఎదురయ్యే పెద్ద పజిల్ ట్రాఫిక్. దీన్ని ఆధారం చేసుకుని కూడా ఇండియన్ ట్రాఫిక్ మ్యాడ్‌నెస్ అనే గేమ్ వచ్చింది. మీకో విషయం చెప్పాలి. విజువల్–లాజికల్ పజిల్స్ ద్వారా మన స్పేషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చెందుతుంది. వస్తువు ఆకారాలు, వాటి మధ్య దూరం, తేడాల్ని గుర్తుంచుకుని దానికి తగ్గట్టుగా స్పందించడానికి ఇది చాలా ముఖ్యమైన జ్ఞానం. అంటే కేవలం వీడియో గేమ్‌ల్లోనే కాదు నిజజీవితంలోను ట్రాఫిక్ రద్దీని విజయవంతంగా ఛేదించుకుని ముందుకు సాగిపోవడానికి పజిల్స్ ఆటలు ఉపయోగపడతాయి.

పజిళ్ల మీదే ఆధారపడి ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తుంటారు. వీటిలో చాంపియన్ అయిన జీవరసాయనవేత్త, బోధనా నిపుణుడు డాక్టర్ గంథర్ కార్బెన్ పజిల్స్ చేసే మేలు అంతా ఇంతా కాదని అంటారు. మెదడులోని అంతవరకు ఉపయోగించని ప్రాంతాల్ని తట్టే ఈ పజిల్ గేమ్స్ 'బ్రెయిన్ జాగర్లు' లాంటివని పేర్కొన్నారు. అంటే శారీరక ఆరోగ్యం కోసం పొద్దునే లేచి ఎలా అయితే జాగింగ్ చేస్తామో అలా పజిల్స్ బుర్రను జాగింగ్‌కు తీసుకెళతాయన్న మాట. అందుకే చాలా దేశాల్లో పజిల్ హంట్‌లు, చాంపియన్‌షిప్‌ల పేరిట పెద్ద హంగామాగా తండోప తండాలుగా ఆడేస్తుంటారు. ఇప్పటి వరకు అసాధ్యంగా నిలిచిన కోనింగ్స్‌బెర్గ్ సెవెన్ బ్రిడ్జెస్, త్రీ కప్స్ ప్రాబ్లెమ్, త్రీ యుటిలిటీస్ ప్రాబ్లెమ్ అంతు చూసేందుకు సీరియస్‌గా పజిల్‌లో పడిపోయిన మేధావులు చాలామంది ఉన్నారు. అనాగ్రమ్‌లు, సైఫర్‌లు, పేపర్ అండ్ పెన్సిల్, కనెక్ట్ ది డాట్స్, మోనోగ్రామ్‌లు, హ్యాంగ్‌మేన్‌లే కాక హిటోరి, టవర్ ఆఫ్ హీనా, నారికాబె, ఫిల్లోమినో, హెయవాకే, లైట్ అప్, మాస్యు, రిపిల్ ఎఫెక్ట్ వంటివెన్నో మీ బుర్ర పదేందుకు ఎదురుచూస్తున్నాయి. ఇవన్నీ ఈజీ ఈజీ అని బుర్ర పేచీ పెడుతుంటే అన్నింటినీ కొంగున చుట్టుకున్న మెటా పజిల్స్ కూడా బోలెడు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తూ మీ మెదడుతో మీకు థ్యాంక్స్ చెప్పించుకోండి. మరిచిపోకండి.. ఏదో అప్పుడప్పుడూ కాదు దినచర్యలో వీటిని భాగం చేయండి. ఇంటి తాళాలు మరిచిపోయే వృద్ధాప్యంలో చెస్ బోర్డుపై ఆధారపడే బదులు చిన్నతనం నుంచే 'దారి కనుక్కోండి'. అలా చేస్తే అంత తేలిగ్గా తాళాలే కాదు రిజల్యూషన్స్‌నూ మర్చిపోరు.



నవ్వుల్ - పువ్వుల్



అల్లుడి పాలసీ



"మీ అమ్మాయికి ఎల్ఐసిలో ఉద్యోగం చేసే అబ్బాయితో సంబంధం కుదిరిందట! ఇంకెందుకు బెంగగా ఉన్నావ్? అడిగాడు అప్పారావు.

"ఏం కుదరడమో ఏమో? పెళ్లికొచ్చే మా తరపు వాళ్ళందరితోనూ తలా లక్ష రూపాయలకి పాలసీలు చేయించాలని నా చేత మాట తీసుకున్నాడయ్యా... అల్లుడు...!" బాధగా చెప్పాడు సుబ్బారావు.

బజారుకెళ్ళడం



ఇద్దరు చెవిటివాళ్లు మాట్లాడుకుంటున్నారు..

మొదటివాడు: ఏరా బజారుకా...

రెండోవాడు: కాదురా బజారుకి..

మొదటివాడు: అవునా! నేనింకా బజారుకనుకున్నా..

రెండోవాడు: సర్లే! బజారుకొస్తావా?

మొదటివాడు: లేదురా బజారుకెళ్లాలి!

అద్భుతం

అప్పయ్య పొద్దునే పేపర్ తెరిచాడు.

రొటీన్ వార్తలు చదవి బోర్ కొట్టడంతో ప్రకటనలు చదవడం ప్రారంభించాడు.

అందులో ఒక ప్రకటన అప్పయ్యని తెగ ఆకర్షించింది.

'కొన్ని వందల సంవత్సరాల ముందు కనిపెట్టిన అద్భుతం...!'

అదృశ్యవీక్షణి ఇది ధరించిన వారు ఇతరులని తాము చూడగలరు కానీ ఇతరులకు తాము కనపడరు అని ఉంది. ఆలసించిన ఆశాభంగం వెల కేవలం ఐదు వేలు."

ఉరుకులు పరుగుల మీద ఆ ఐదు వేలు చెల్లించి కొరియర్‌లో ఆ సామాను తెప్పించుకున్నాడు.

తీరా తెరచి చూస్తే... అది ముసుగు.

రెండువందలు



కోపంగా వంటింట్లోకి వచ్చాడు రవి.

"ఏమైంది... పొద్దున్నే మొహం అలా పెట్టారు". అడిగింది లత.

రవి: నీ సుపుత్రుడు ..మళ్ళీ నా జేబులోంచి డబ్బులు తీసుకెళ్ళాడు

లత: వాడి మీద మీకెందుకు అంత అనుమానం.. అయినా వాడే తీశాడనేముంది నేను కూడా తీసి ఉండొచ్చుగా.

రవి: నువ్వేం కాదులే

లత: మీకెలా తెలుసు?

రవి: జేబులో ఇంకా రెండొందులున్నాయిగా?!

మంచిది

తన రూమ్‌లోకి క్యాలెండర్ కావాలంటూ బజారుకెళ్ళాడు రాము. యజమాని క్యాలెండర్లు చూపిస్తుంటే ప్రతి దాన్ని వద్దంటూ.. "ఇంకాస్త మంచిదివ్వండి" అంటున్నాడు.

"నీ దృష్టిలో మంచిదంటే ఏంటి? విసుగుగా అన్నాడు యజమాని.

"అంటే స్కూలుకు సెలవులు బాగా ఇచ్చేలా ఎర్ర రంగు గళ్ళు ఎక్కువుండాలి" అన్నాడు రాము.

నిద్రపోయే ముందు



డాక్టర్ రాసిచ్చిన ప్రిస్కిప్షన్ మందుల షాపువాడికి ఇచ్చి "ఇందులో రాసిన మందు సీసాలు రెండివ్వండి" అని అడిగాడు వాసు.

"రెండెందుకండీ?" అమాయకంగా అడిగాడు షాపువాడు.

"ఈ సీసాలోని మందు నిద్రపోయే ముందు తాగమన్నారు. ఒకటి ఇంట్లోకి, రెండోది ఆఫీసులోకి".!!

కొంచెం నీరు... కొంచెం నిప్పు...

జీవితంలో బ్యాలెన్స్ ఉండాలి. తీవ్ర వైరుధ్యాల మధ్య స్థిరత్వం కావాలి. నిన్న మొన్నటి ఆరాధ్య తార అను అగర్వాల్ పరిస్థితి అదే. ఆమె అందానికి వివశులై పాదాలపై మోకరిల్లే ఆరాధకుల తీవ్రత ఓ వైపు, తన ఆత్మదౌర్బల్యం నుంచి పారిపోతూ మరొకరి పాదాక్రాంతమైన తీవ్రత మరోవైపు. ఈ రెండు పార్శ్వాల కల్లోలంలో చిగురుటాకులాంటి మనస్థితిలో ఉన్న అనూకు యాక్సిడెంట్ అయ్యింది. చావును అతి దగ్గర నుంచి చూసొచ్చింది. ఆ చిన్ని జీవితంలో ఎన్ని మలుపులో...

అను అగర్వాల్ ఓ ఢిల్లీ సాంప్రదాయక కుటుంబంలో పుట్టిన అమ్మాయి. అమ్మమ్మ నుంచి నాన్నమ్మ నుంచి నేర్చిందంతా ఆధ్యాత్మికతే. తండ్రి కాస్త ఆదరువు. చదువు సంధ్యా పూర్తయ్యాయి. తదుపరి అడుగులు ఎటూ. వాటి జాడ కోసమే అప్పటి బొంబాయిలో ఒంటరిగా కాలుపెట్టింది. తండ్రి అడ్డు చెప్పలేదు కానీ 'నీ జీవితానికి నీదే బాధ్యత' అని ఒక్క మాటతో అంతులేని భారాన్ని వేశాడు. పేయింగ్ గెస్ట్ గానీ అతిథి మర్యాదలంటూ ప్రత్యేకమేం కాదు. నేల మీద పడక. తానుండే ఇంటికి ఎదురుగ్గా పృథ్వీ థియేటర్. సినిమాల సందోహాలు. శృంగార తారల బొమ్మల దగ్గర అభిమానుల సందళ్లు. ఆ వీధిలో ఎవరూ సాహసించని మోడలింగ్ కల. దాని దగ్గరగా సినిమా లోకం కళ్ల ముందే. తాను శృంగార తారను మించిన ఆరాధ్య దేవతనని వీధి మలుపుల్లో కుర్రకారు పడిగాపుల్లో తెలిసిపోతోంది. సినీ అభిమానుల సందడి థియేటర్ నుంచి తప్పి తన వైపు మళ్లడంలో బలపడుతోంది. ఈలోగా సొసైటీ మేగజైన్ కవర్‌పై ఫొటో. భారతదేశపు సూపర్ మోడల్ దొరికిందని భారీ ప్రచారం. దాంతో పాటే అవమానాలు, ఈసడింపులు. కానీ రంగుల లోకం మెరుపుల్లో అవన్నీ తెలతెలబోయాయి. అను అగర్వాల్‌కు మహేష్ భట్ నుంచి కబురందింది. 'ఆషికీ' చిత్రంలో హీరోయిన్‌గా అవకాశమొచ్చింది. అది చాలు బాలీవుడ్ అంతా క్యూ కట్టడానికి. బోహేమెన్ బొమ్మలా ఆరాధకుల్ని శిలల్ని చేసేసే అందం ఆమె సొంతం. కళ్లతోటే చిత్రాన్నంతటినీ నడిపించేసింది. 1990లో విడుదలైన ఆ చిత్రం భారీ హిట్టు. పేయింగ్ గెస్ట్ విడిది పోయి రెస్టే లేని ఆతిథ్యాలతో పగళ్లు, రాత్రుళ్లు గిర్రున తిరిగిపోతున్నాయి. కళ్లు తిరిగే మైకపు ప్రపంచం. ఊపిరాడని బిజీ లోకం. షూటింగ్‌లు, ఫంక్షన్లు ఎక్కడకెళ్లినా మహారాణి వైభవం. క్లియోపాత్రకు మించిన వైభోగం. ఆరేడేళ్లు ఏమైపోయాయో తెలీదు. అంతర్జాతీయ బిగ్‌షాట్‌లతో సాంగత్యమే కానీ తనకంటూ జీవితం మిగిలి ఉందా అనే ప్రశ్న. అదే ఆలోచనై పోయింది చిన్నప్పుడు చదివిన ఓ యోగి జీవిత కథ గుర్తుకువచ్చింది. ఇంట్లో ప్రతిధ్వనించే ఆధ్యాత్మికత గుర్తొచ్చింది. అదన్నా తన హృదయంలోని వెలితిని తుడిచి పెట్టేస్తుందా. ఈ తీవ్రత నుంచి ఉపశమనం కలిగిస్తుందా అని వెతుక్కుంటూ వెళ్లింది. ఆశ్రమ జీవితం ఉదాత్తమనే భావన, మనసుకు ప్రశాంతతనిస్తుందన్న ఉద్దేశం. ఆధ్యాత్మిక చింతనలో తాంత్రిక్ లవ్ పేరిట మరో చింత. మరో ఉద్దీపన. ఆనంద ప్రియగా పేరు మార్పు. అన్ని పాశాల్ని తెగతెంపులు చేసే లక్ష్యం కాస్తా పూర్తిగా దారి తప్పి మరో తీవ్రతలోకి తేలిపోయింది. ఆ మైకంలో పూర్తిగా పెనవేసుకుపోయింది. సాటి శిష్యులకు ఈర్ష్య కలిగేంతగా స్వామీజీతో బంధనంలో చిక్కుకుపోయింది. దాన్నుంచి బయటపడే శక్తి లేదు. అక్కడే ఉంటే ఏమైపోయేదో కానీ ఆమె వల్ల కాని దాన్ని తోటి శిష్యులే కానిచ్చేశారు. ఓ ట్రక్కులో కట్టేసి బయటకు పంపించేశారు. మళ్లీ ఆశ్రమ ప్రాంగణంలో అడుగు పెట్టకుండా గేట్లు వేసేశారు.

యాక్సిడెంటల్‌గా...

1999లో మళ్లీ ముంబై వర్లీకి జీవితం. మళ్లీ తళతళలు, క్షణం తీరికలేని పార్టీలు. అమెరికా కాన్సులేట్‌లో జరిగిన పార్టీ నుంచి తిరిగి వస్తుండగా కారు ప్రమాదం. ఊడిన కారు చక్రంతో సమానంగా కారు పల్టీలు. శరీరంలో చాలా ఎముకలు నుజ్జు, తలకు బలమైన గాయాలు. బతకడం కష్టం కాదు ఆస్పత్రి వరకు ఎలా ప్రాణాలతో వచ్చిందో వైద్యులకు అర్థం కాలేదు. వరస పెట్టి శస్త్ర చికిత్సలు, శరీర మంతా కుట్లు. 29 రోజుల కోమా. తిరిగి మెలకువ వచ్చాక తానెవరో తెలీని అయోమయం. హిస్టీరికల్ పోస్ట్ ట్రామాటిక్ అమ్నేసియా, మెమొరీ లాస్. మళ్లీ కొత్త జీవితాన్ని చిన్నారిలా ప్రారంభించింది. నిద్ర లేచాక వెలుగుతో పాటు కనిపించే నర్సులు విష్ చేసే గుడ్ మార్నింగ్‌తో అది పగలు అని కొత్తగా తెలుసుకుంది. బంధువుల్ని గుర్తు పట్టలేకపోయింది. తల్లిదండ్రుల వైపు ప్రశ్నగా చూసింది. మూడున్నరేళ్ల సుదీర్ఘ యాతన తర్వాత కోలుకుంది.

ఆమె సైతం...

జీవితంపై కొత్త అభిప్రాయం కలిగిందా సమయంలో. తన ఆస్తినంతా విడిచిపెట్టేసింది. సమాజానికి అదీ చిన్నారులకు ఏదైనా చేయాలన్న బలమైన కాంక్షలో మనసు కుదుట పడింది. ఇప్పుడు సరైన బ్యాలెన్స్ దొరికింది. రెండు తీవ్రతల నుంచి తప్పించుకోవడానికి బలమైన ఆధారం దొరికింది. ముంబై ధారవి మురికి వాడల పిల్లల్ని 'అను ఫన్ యోగా'తో అల్లుకుపోయింది. గతంలో ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు వార్డు దగ్గర చేసిన సామాజిక సేవ గుర్తొచ్చింది. అబార్షన్ల కోసం బారులు తీరిన మహిళలకు లైంగిక సమస్యల గురించి వివరించిన తనలోని సామాజిక కార్యకర్త మళ్లీ పలకరించింది. అప్పట్లో కండోమ్ మాటెత్తితేనే తల తిరిగిపోయే మహిళా సమాజంలో దానికి విశేష ప్రచారం చేస్తానంటూ ముందుకొచ్చిన తనలోని సాహసి మళ్లీ ధైర్యాన్నిచ్చింది. ఇప్పుడు అను అగర్వాల్ తీవ్రతల నుంచి ఉపశమనం పొందుతోంది. ఆ పరిపూర్ణత నుంచే తనలో జ్వలించి శాంతించిన పాత్రలపై ఓ పుస్తకం తెచ్చింది. తన అసాధారణ జీవితానికి తగ్గట్టుగా 'అనూజ్యువల్: ఎ మెమైర్ ఆఫ్ ఎ గర్ల్ హూ కమ్ బ్యాక్ ఫ్రమ్ డెత్' అని పేరు పెట్టుకుంది. 'ఆషికీ' అను అగర్వాల్ మీకు సరిగ్గా గుర్తుకు రాకపోవచ్చు కానీ, మణిరత్నం చిత్రం 'దొంగ దొంగ'లో 'కొంచెం నీరు కొంచెం నిప్పు..' పాట వింటే మీకు ఆ 'చంద్ర లేఖ' కళ్లలో మెదులుతుంది. ఆ పాటలో చెప్పినట్టే కొంచెం గరళం, కొంచెం అమృతం, కొంచెం నరకం, కొంచెం స్వర్గం కూడా ఉన్నాయి ఆమె జీవితంలో. ✦

అరవిరి



పచ్చని పచ్చిక బయ
ఆరపోసిన అందాలకు
ఆ పచ్చని సీమలో అతి
విచిత్రమైన ఆయుధాల
చేస్తుంది. దాని రాజధా
పట్టైన నాగాల కోహిమా

ఈశాన్య భారత్‌దేశంలో సముద్రమట్టానికి 1,495 మీటర్ల ఎత్తులో ఉంది నాగాలాండ్ రాజధాని నగరం 'కోహిమా'. ఒకప్పటి అంగామీ తెగకు ఆయువుపట్టుగా నిలిచిన కోహిమా ప్రకృతి అందాలతో పర్యాటకులను మంత్ర ముగ్ధుల్ని చేస్తుంది. ఇక్కడ దొరికే కేమీమ పూలు చూపు తిప్పుకోకుండా చేస్తాయి. కేహిమా లేదా కేహెరా పూల వల్ల ఈ ప్రాంతాన్ని కేవ్హిమా అనే పేరుతో పిలిచేవారు. బ్రిటీషు దీన్ని కోహిమాగా పలికేవారు. ఇక అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని కోహిమాగా పిలుస్తారు. ఆంగ్లేయుల ప్రభావం ఇక్కడ ఎంత ఉందనడానికి సాక్ష్యం ఇంగ్లీషు అధికారిక భాషగా ఉన్న ఏకైక ప్రాంతమిది. బర్మా, టిబెట్ వంటి దేశాలు, ప్రాంతాలకు చెందిన 16 జాతుల గిరిజనులు ఇక్కడ దర్శనమివ్వడం విశేషం. రంగు రంగుల దారాలు, కంకణాలు ధరించిన చేతులతో, ఛాతీకి కవచాలతో ఉండే నాగాలాండ్ గిరిజనులు ఎన్ని మార్పులు చేర్పులు వచ్చినా ప్రభావాలకు లోనైనా వారి సాంస్కృతిక జీవన శైలిని కాపాడుకుంటూ వస్తున్నారు. దాన్ని కళ్లకు కట్టేందుకు కోహిమాలో మ్యూజియాలు, ఉత్సవ గ్రామాలున్నాయి.

కోహిమా స్టేట్ మ్యూజియం



ఈ మ్యూజియాన్ని బయావు హిల్‌పై 1970లో నాగాల్యాండ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పండుగ సమయాల్లో ఒకప్పటి గిరిజనులు వాడే అతిపెద్ద డప్పు వాయిద్యాలను ఇక్కడ భద్రపరిచారు. వారి ఘన చరిత్రకు సాక్ష్యంగా నిలిచే విగ్రహాలు నిలువెత్తు స్థూపాలు, అలంకరణకు వాడిన నగలు, తోరణాలు ఇక్కడ చూడొచ్చు. ఈశాన్య రాష్ట్రాలలో మాత్రమే కనిపించే అరుదైన పక్షుల కేంద్రాన్ని కూడా ఇక్కడే ఓ హాలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నాగాలాండ్ లోని వివిధ తెగల సాంప్రదాయ దుస్తులు, ఆహార్యం, కళారూపాలు, సంగీత సాధనాలు, రత్నాభరణాలు, వెండి గంటలూ మొదలైన ఎన్నో వస్తువులు ఇక్కడ భద్రపరిచి ప్రదర్శనకు వుంచారు.

కేథలిక్ చర్చి

కోహిమాలోని అరదుర కొండలపైన ఉన్న ఈ చర్చి పరిసర ప్రాంతాల్లో వున్న చర్చిలన్నింటిలోకీ ఎంతో పెద్దది. ఇక్కడ చెక్కతో చేసిన శిలువ దేశంలోనే అతిపెద్ద శిలువగా ప్రఖ్యాతి పొందింది. విస్తారమైన ప్రదేశంలో నిర్మించిన ఈ చర్చిలో ప్రార్థనలు చేసుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో ఆరాధకులు వస్తుంటారు.

డిజుకో లోయ

సముద్ర మట్టానికి 2,438 మీటర్ల ఎత్తులో ఉన్న డిజుకో లోయ ప్రాంతం ట్రెకింగ్‌కు అనువైంది. ఇక్కడి లోయల్లో తెలుపు, పసుపు, పచ్చ రంగుల్లో విరబూసే లిల్లీ పూలు సందర్శకుల మనసును దోచుకుంటాయి. ప్రపంచ ప్రసిద్ధి పొందిన రోడో డేన్డ్రాన్ పూలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. డిసెంబరు నెలలో అధికంగా కురిసే మంచుతో ఈ ప్రదేశమంతా
మారిపోతుంది.

యుద్ధ వీరుల అమరస్థలి

రెండవ ప్రపంచ యుద్ధ సమ
ఆక్రమించుకుంది. జపాన్ సేనలతో
ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల
స్మృత్యర్థం ఇక్కడ ఓ అమరస్థలిని
ఏర్పాటుచేశారు. దీన్ని వద్ద గల రాతి
ఫలకాలపై 'మీరు ఇంటికి
వెళ్ళినపుడు మీ రేపటి కోసం మేం
ఈ రోజున మా ప్రాణాలు త్యాగం
చేశాం అని అందరికీ తెలపండి' అనే
వాక్యాలు వారి త్యాగఫలాన్ని గుండెల
చెమర్చుతాయి. యుద్ధంలో చనిపో
వివరాలతో కంచుతో తయారు చేసి
వద్ద ఏర్పాటు చేశారు. ఇక్కడ జరిగిన
పాటు వివిధ దేశాలకు చెందిన వీరు
వీరికి శ్రద్ధాంజలి అర్పించేందుకు కెన
బంధువులు, మిత్రులు వస్తారు. కో
తప్పనిసరిగా ఈ స్థలిని దర్శించి ని

ఖనోమా

ప్రకృతి సౌదర్యానికి పుట్టినిల్లు
కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న
పొలాలతో శోభిల్లే ఖనోమా వ్యవసా
తలపిస్తాయి. వివిధ ఎత్తుల్లో లోయ
కనిపించే పైరు సీమల్ని చూసేందుక
ఎక్కువగానే ఉంటుంది. ఇక్కడ పండ
గురించి వారు తెలుసుకునేందుకు

హార్న్ బిల్ ఫెస్టివల్

నాగా ప్రజల జీవనాన్ని ప్రతిబిం
ఫెస్టివల్‌కి ఎంతో ప్రాముఖ్యత ఉంది
చేతికళల ప్రదర్శనలతో ఈ పండుగ
పలుకుతుంది.ప్రతి నెలా ఇక్కడ వి

సిన అందం.. కోహిమం

ష్ప, ఎత్తైన కొండ కోనలు, లోతైన లోయలు, నిత్యం ప్రకృతి టపట్టు నాగాల్యాండ్. అందమైన పర్వత శ్రేణుల్లో ఒదిగిపోయిన యంలో పడేసే సాంప్రదాయాలు, చిత్రమైన వేషధారణలు, కనిపించే ఆదివాసీల జీవనశైలి ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం కోహిమాలో ఈ అచ్చెరువులన్ని కోకొల్లలు. ఆదివాసీల అద్దం 5 కోహిమాను మనమూ చుట్టొద్దామా....!

మంచు ఎడారిలా

ంలో జపాన్ కోహిమాను
రోచిత పోరాటం చేసి



ప తాకేలా చేసి కళ్ళను
న 1421 మంది అమరుల
ఈ ఫలకాలు ప్రతి సమాధి
యుద్ధంలో భారతీయులతో
కూడా అసువులు బాశారు.
, ఇంగ్లాండ్‌ల నుంచి వారి
మాకు వచ్చిన విదేశీయులు
ులు అర్పిస్తుంటారు.

ోమా. కోహిమాకు పది
ామం ఇది. పచ్చని వరి
క్షేత్రాలే ఓ వర్ణచిత్రాన్ని
ాటంగా గట్లు గట్లుగా
సందర్శకుల తాకిడి
ంచే 20 రకాల వరి వంగడాలు
్సాహం చూపుతారు.

ించే పండగల్లో హార్న్‌బిల్
నృత్యాలు, పెరేడ్‌లు, డాన్స్‌లు,
ర్యాటకులకు స్వాగతం
ధ తెగలకు సంబంధించిన

పండుగలు జరుగుతూనే ఉంటాయి. డిసెంబర్ మొదటి వారంలో జరుపుకునే ఈ హార్న్‌బిల్ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకుంటారు. నాగాల్యాండ్‌లో నివసిస్తున్న తెగలన్నింటినీ పరిరక్షిస్తూ వారి సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికి తెలిసేలా అక్కడి ప్రభుత్వమే 2006 నుంచి ఏటా ఈ పండుగను నిర్వహించడం ఓ విశేషం. హార్న్‌బిల్ పక్షికి వారి సంస్కృతిలో విశేష ప్రాధాన్యం ఉంది. అందుకే దాని పేరిట ఈ భారీ ఉత్సవానికి పేరు పెట్టారు. నాగా డ్యాన్సులు, డోలు వాయిద్యాలతో ఆ ప్రదేశమంతా కన్నుల పండుగలా మారుతుంది.

నాగా బజార్

సందర్శకులతో నిత్యం రద్దీగా ఉంటుంది నాగా బజార్. ఇదో పురాతనమైన సంత. ఇతరుల కంటే విభిన్నంగా వుండే నాగాల అహార పదార్థాలు, రకరకాల మాంసాహారం, ఇతర నిత్యావసర వస్తువులూ ఇక్కడ లభిస్తాయి. స్థానికులు, టూరిస్టులతో ఎంతో సందడిగా ఉంటుంది ఈ ప్రదేశం.

కచారీ రాజుల దిమాపూర్

నాగాల్యాండ్‌లో చూడదగిన మరో ప్రధాన నగరం దిమాపూర్. వాణిజ్య రాజధానిగా పేరొందిన దిమాపూర్ అతిసుందర నగరం. నాగాల్యాండ్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాలైన అస్సాం, త్రిపుర, మిజోరం, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాలకు దగ్గరగా వుంటుంది దిమాపూర్. అందుకేనేమో రాష్ట్రం మొత్తం మీద ఉన్న ఏకైక విమానాశ్రయాన్ని ఇక్కడే నిర్మించింది ప్రభుత్వం. ఒకప్పటి కచారీ



చేరుకోవడం ఇలా

విమాన మార్గం

నాగాల్యాండ్ వాసుల ఒక్కగానొక్క విమానాశ్రయం దిమాపూర్ విమానాశ్రయం. కోహిమాకు 74కి.మీ దూరంలో ఉన్న దిమాపూర్‌కు ఢిల్లీ, కొల్‌కతా, ఇంఫాల్‌ల నుంచి విమాన సర్వీలు ఎక్కువగా ఉంటాయి.

రైలు మార్గం

కోహిమాకు నేరుగా రైల్వే సదుపాయం లేదు. దిమాపూర్ నుంచి ఇక్కడికి చేరుకోవాల్సి ఉంది. కొల్‌కతా, గౌహతిల నుంచి రైళ్ళు నడుపుతున్నారు.

రోడ్డు మార్గం

దిమాపూర్‌కు 135 కి.మీ దూరంలో ఇంఫాల్ ఉంది. ఇక్కడి నుంచి అధిక సంఖ్యలో ఉన్న బస్సులు టూరిస్టులను కోహిమాకు చేరుస్తాయి. మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర ప్రాంతాల నుండి బస్సులను విస్తారంగా అందుబాటులో ఉంటాయి.

రాజుల కట్టడాలు రాచరికానికి దర్పణంగా దిమాపూర్‌లో వాటి ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడక్కడా దర్శనమిస్తాయి.

షాపింగ్‌కో ఊరు

గిరిజనులు తయారు చేసే వస్తువులు దొరికే అందమైన ప్రదేశం రుజాఫేమా. ఈ ఊళ్లో అవి కాస్త తక్కువ ధరకే లభిస్తాయి. ఇది దిమాపూర్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. టూరిస్టులు షాపింగ్ చేయడానికి ప్రత్యేకంగా ఈ ఊరు వస్తుంటారు. కోహిమా నగరం నడిబొడ్డున ఉన్న బస్ స్టేషన్‌కు ఎదుగా ఉంటుందీ సేల్స్ ఎంపోరియం. ఇక్కడ రకరకాల వెదురు బుట్టలు, చెక్కతో చేసిన అందమైన బొమ్మలు, హస్త కళాకృతులు, రంగురంగుల శాలువాలు వాచీలు ఇలా ఎన్నో వస్తువులు లభిస్తాయి. నాగాల్యాండ్‌కు వచ్చే టూరిస్టులు ఎక్కువగా షాపింగ్ చేసే ప్రదేశం ఇది.

ప్రకృతి జీవనం

నాగాల్యాండ్ ప్రజలు అధికంగా మాట్లాడే భాష నాగ భాష. ఈ భాషకి లిపి లేదు. మొత్తం జనాభాలో 80 శాతం మంది ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. వివిధ రకాల తెగలు జీవనాలతో ముడిపడిన పండుగలతో ఏడాది పొడవునా పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. నాగాల్యాండ్ మనదేశపు సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ మిలిటరీ భద్రత ఎక్కువగా ఉంటుంది. ఈ రాష్ట్రంలో ప్రజలకి సొంతాస్తులు ఉండవు. అందుకే భూముల అమ్మకాలు కొనుగోళ్ళ ప్రక్రియ ఇక్కడ లేదు. గ్రామపెద్దే ఇక్కడి వ్యవసాయ భూమిని ఇంతమందికని నిర్ణయిస్తాడు. అక్కడ లభించే అటవీ ఉత్పత్తులను సేకరించి వాటిని విక్రయిస్తూ అక్కడి ప్రజలు జీవనం సాగిస్తారు. పూర్తిగా ప్రకృతితో మమేకమై సాగే వారి ప్రశాంత జీవనశైలి ఆదర్శప్రాయం.

కోహిమా అందాల గురించి ఎంత చెప్పినా అది తక్కువే! ఈ సుందర ప్రపంచాన్ని మనం స్వయంగా చూసి రావాల్సిందే.

- శర్వాణి

'నట' రాజం

ఇంతలేసి కళ్ళు... వెన్నెల్లాంటి నవ్వు నవరసాల్ని వేలి ముద్రల మీద పలికించగల చతురత కథానాయిక పాత్రలోనే కాకుండా అన్ని పాత్రల్ని అవలీలగా నటించగల చక్కని నటి రాజ సులోచన. హాస్యం, శోకం, శృంగారం, వీర రసాల్ని పలికించే తీరు ముదావహం.

కృష్ణమ్మ తీరాన పుట్టి పెరిగిన రాజసులోచన చిన్నతనం నుంచీ ఆటా పాటా మాటా అన్ని విషయాల్లో చురుగ్గా వుండి పదుగుర్ని ఆకర్షించేది. తండ్రి భక్తవత్సలం నాయుడు అతి గారాబం చేసి మగరాయుడిలా పెంచాడు. ఊహ తెలిసినప్పటి నుండీ చెన్నపట్నంలోనే రాజసులోచన పెరిగింది. భక్తవత్సలం నాయుడికి ఉద్యోగరీత్యా చెన్నపట్నానికి బదిలీ కావడంతో... తనూ తల్లిదండ్రులతో పాటు ట్రిప్లికేన్‌కు చేరింది. అప్పటికింకా ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలు విభజన కాలేదు. పారిస్, తండియార్‌పేట, ట్రిప్లికేన్‌లో తెలుగువారి హవా నడుస్తుండేది. అక్కడే తోపు వెంకటాచలం వీధిలో 1939లో స్థాపించిన సుప్రసిద్ధ సంస్థ శ్రీ సరస్వతీ గానసభ సంగీత, నృత్య, నాటకాదులకు పెట్టింది పేరుగా పరిఢవిల్లేది. నాట్యంపట్ల చిన్నతనం నుండే మక్కువ పెంచుకున్న రాజసులోచన తల్లిదండ్రుల్ని పోరి మరీ ఆ సంస్థలో శిక్షణ పొందేందుకు అనుమతిని సాధించింది. మిగతా కళాకారులందరి కంటే నృత్యంతో పాటు అభినయంలోనూ ముందుండేది. ఈ ఉత్సాహంతోనే 1963లో పుష్పాంజలి నృత్య కళాకేంద్రాన్ని ప్రారంభించి తెలుగు, తమిళ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రదర్శనలిస్తుండేది. ఆ రోజుల్లో రాజసులోచన నృత్య ప్రదర్శనంటే ప్రేక్షకులు మైమరిచిపోయేవారు. అలాగే ప్రేక్షకుల హర్షధ్వానాలు చూస్తూ రాజసులోచన తనను తాను మరిచిపోయేది. ఒకసారి ప్రదర్శన ఇస్తూ చివర్లో వీక్షకుల స్పందన చూసి అడుగులు వెనక్కి వేస్తూ అభినయం చేస్తుండగా కాలు జారి కిందపడి కాలు విరగొట్టుకుంది కూడా. అంతగా నృత్యంలో మమేకమయ్యేది రాజసులోచన.

చిత్రసీమలో అరుదైన నటిగా..

తన నృత్య ప్రదర్శనల ద్వారా సినీ వర్గాలను ఆకట్టుకున్న రాజసులోచన కన్నడంలో 'గుణసాగరి' చిత్రం ద్వారా తెరంగేట్రం చేసింది. తెలుగులో ఘంటసాల నిర్మించిన 'సొంతవూరు' చిత్రంలో తొలిసారిగా నటించింది. ఈ చిత్రంలో నటిస్తుండగా నృత్య దర్శకులు పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి పెద సత్యం, వెంపటి చిన సత్యం, వేదాంతం జగన్నాథ శర్మల వద్ద శిక్షణ తీసుకుని కూచిపూడి నృత్యంలో పరిపూర్ణతని సాధించింది. ధర్వార్ కృష్ణకుమార్ వద్ద కథాకళి నేర్చుకుంది. వరసగా సినిమాల్లో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. రంగూన్ రాధ, పెంకి పెళ్ళాం, తోడి కోడళ్ళు, సారంగధర, సువర్ణ సుందరి, మాంగళ్య బలం అవి చివరి రెండు చిత్రాల గురించీ విశేషించి చెప్పుకోవాలి. సువర్ణసుందరి చిత్రంలో అక్కినేనిలా నటించవలసిన సందర్భంలో రాజసులోచన అద్భుతమైన నటనను కనపరిచింది. 'నా నోము పండె ఈనాడే' గీతానికి నృత్యం చేస్తూ అక్కినేనిగా

మారిపోవడం... ఆడవేషంలో వున్నప్పటికీ అక్కినేనిలా అచ్చు గుద్దినట్లు నటించడం ఆ రోజుల్లో అందరి నోటా ఆమె పేరే మార్మోగింది. అలాగే 'మాంగళ్య బలం' చిత్రంలో రేలంగితో కలసి నటించి చక్కని జంటగా అరుదైన కామెడీ పండించింది. 'పెళ్ళినాటి ప్రమాణాలు', 'రాజ మకుటం'లో ఆమె నటన అద్భుతం. ఈ చిత్రంలో పి.లీల పాడిన 'సడిసేయకో గాలి' పాటను యన్టీఆర్ రాజసులోచనల మీద చిత్రీకరించారు. భాగ్యదేవత, జయభేరి, శాంతి నివాసం, మహాకవి కాళిదాసు, శభాష్ రాజా, ఇద్దరు మిత్రులు, టైగర్ రాముడు, వెలుగు నీడలు, తాతా మనవడు ఇత్యాది చిత్రాల్లో అరుదైన నటనతో తనముద్ర వేసుకుంది.

విదేశాల్లో అందెల సవ్వడి

ఆమె స్థాపించిన పుష్పాంజలి సంస్థకి విదేశాల్లోను విశేషమైన పేరొచ్చింది. అమెరికాలో ప్రవాస భారతీయుల అభ్యర్థన మేరకు కొన్నాళ్ళ పాటు పుష్పాంజలి సంస్థను అక్కడే కూతుళ్ళ వద్ద ఉంటూ కొనసాగించింది. రాజసులోచన ముక్కుసూటి మనిషి. ఆనందం వచ్చినా, ఆవేశం ఆవహించినా దాచుకోలేని మనిషి. అందుకే అమెరికా నుండి అర్ధాంతరంగా వచ్చేసింది. 'సన్నజాజులు' చిత్రంలో ఓ ప్రధాన పాత్రను నిర్మాత, దర్శకుల ఒత్తిడి మేరకు ఒప్పుకుంది. అప్పట్లో ఆమెలో ఓ పరివర్తన కనిపించింది. 'దేశాన్ని విడిచిపెట్టి నేనేం కోల్పోయానో అర్థమైంది... మనిషికి కావాల్సింది మానవ సంబంధాలు. మానవ సంబంధాల్లోని జీవన మాధుర్యమే గానీ పైపై మెరుగులకు మోసపోకూడదు. అక్కడేముంది? ఆకాశ హర్మ్యాలూ.. కృత్రిమమైన ఆనందాలూ తప్ప...' అంటూ ఆత్మీయులతో తన భావాల్ని పంచుకునేది. చెన్నైలో అభిరుచిగల చిన్నారులకు నృత్యంలో శిక్షణనిచ్చేది. తనకు కథాకళి నేర్పించిన ధార్వార్ కృష్ణ కుమార్ మాస్టారికి మ్యూజిక్ అకాడెమీలో ఘన సన్మానం చేసి ఆర్థికంగా సహాయపడింది. పాతతరం నటీమణులతో కలుపుగోలుగా వుంటూ పండగలూ పబ్బాలకూ అందరూ ఆనందాన్ని పంచుకునేలా తనే ముందుండేది. ఆమెకు వయసు మళ్ళినా... అరవై ఏళ్ళ వయసులోను నృత్యం చేస్తూ పసిపిల్లలా కేరింతలు కొట్టేది. మానవ జీవితంలో నాట్యం ఇచ్చే తృప్తి మరే శక్తీ ఇవ్వలేదని అనేది.

కొన్ని మలుపులు..

ఆ రోజుల్లో దర్శక పితామహుడు సి.పుల్లయ్య గారంటే పరిశ్రమలో ఎనలేని గౌరవం వుండేది. ఆయన కొడుకే సి.యస్. రావు. అపుడే బి.ఎ.లిటరేచర్ పూర్తి చేసి సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నాడు. అప్పట్లో సుప్రసిద్ధ నటులు కన్నాంబ, కడారు నాగభూషణంల కుమార్తె రాజరాజేశ్వరిని ఆయన వివాహమాడాడు. వారికి ఒక కుమారుడు కలిగాడు కూడా. కొన్ని కారణాల వల్ల రాజరాజేశ్వరి సి.యస్.రావు నుంచి విడాకులు తీసుకుంది. వారింట్లో పనిచేస్తున్న బ్రహ్మం అనే వ్యక్తిపై అభిమానం పెంచుకుని అనంతరం ఆయన్నే వివాహం చేసుకుంది. ఈ బ్రహ్మన్ని హీరోగా పెట్టి కన్నాంబ 'సవతి కొడుకు' చిత్రాన్ని నిర్మించింది. ఇందులో యన్.టి.రామారావు ఒక హీరో. ఈ సినిమా ఆశించినంత స్థాయిలో విజయవంతం కాలేదు. తన కూతురు మూలంగా ఒక మంచి దర్శకుడి భవిష్యత్తు దెబ్బతింటుందని బాధపడిన కన్నాంబ చివరకు తనే సి.యస్.రావుని ఒప్పించి రెండో పెళ్ళికి సిద్ధం చేసింది. అప్పటికే సి.యస్.రావు మనసులో రాజసులోచన వుందని గ్రహించి... కన్నాంబే పెద్దరికం వహించి వారిద్దరి పెళ్ళి జరిపించింది. ఇది వీరి జీవితంలో గొప్ప శుభ పరిణామం.

అగ్ర నటులతో అనుబంధం

యన్.టి.ఆర్ రాజసులోచనని బాగా అభిమానిస్తూ ప్రోత్సహించేవారు. రాజసులోచన అక్కినేనిని అభిమానించేది. 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో అక్కినేనితో నటించాలని దుక్కిపాటిని ఆశ్రయించింది. అన్నపూర్ణా బ్యానరులో మొదట సావిత్రిని ఆ వేషానికి అనుకున్నా, ఆదుర్తి రాజసులోచన పట్టుదలకి మెచ్చి హీరోయిన్‌గా మంచి పాత్రనిచ్చి ప్రోత్సహించారు. ఆ చిత్రంలో 'ఒహో...ఒహో...నిన్నే నిన్నే కోరికొ పాట తనకెంతో ఇష్టం. హుషారుగా ఉన్నపుడు ఆ పాటనే కూనిరాగం తీస్తుండేది. ఎప్పుడూ ఉత్సాహంగా గలగలమనే ఆ అందెల చప్పుడు 2013 మార్చి 5న ఆగిపోయింది.

ఇమంది రామారావు
9010133844



మేఘాల్లో సర్ఫింగ్

రోడ్డుపై స్కేటింగ్ అయిపోయింది. మంచులో స్కీయింగ్ కూడా పోయింది. నీటిలో వేక్ బోర్డింగ్ కూడా బోర్ కొట్టించింది. ఆకాశంలో స్కై సర్ఫింగ్ కూడా కిక్కు తగ్గింది. ఇక విసిగి పోయి ఆరన్ వైపిస్జిన్స్కీ 'వింగ్ బోర్డింగ్' అంటూ కొత్త ఆటకు రూపకల్పన చేశాడు. విమానం తోకకు వేక్ బోర్డ్ లాంటి వింగ్ బోర్డ్ కట్టేసి గాల్లో తేలుతూ ఆకాశంలో సర్ఫింగ్ చేయడమే ఈ కొత్త సాహస క్రీడలో వినోదం. చేసేవాళ్లు న్నారేమో గానీ చూసే వారికి మాత్రం ఎక్కడ కింద పడతాడేమోనని గుండె గుబిళ్లు మంటుంది. అదే అసలైన థ్రిల్ అంటాడు 31 ఏళ్ల ఆరన్. చిన్నప్పుడే లెగో బ్రిక్స్‌తో విమానాల బొమ్మలు తయారుచేసి ఆడుకున్న ఆరన్‌కు పెద్దయ్యాక కూడా విమానాల పిచ్చి వదల్లేదు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌పై పట్టు సంపాదించి ఫ్లైట్ టెస్ట్ ఇంజినీర్‌గా వృత్తి కొనసాగిస్తూ ఈ సరికొత్త బోర్డును రూపొంది ంచాడు. సర్ఫ్ చేసే వ్యక్తితో పాటు బోర్డుకు కూడా ప్యారాచూట్ పెట్టి క్షేమంగా నేలకు వాలే ఉపాయం ఆలోచించాడు. మొదటి ప్రొటోటైప్ చేయడానికి నిధుల్ని సమకూర్చుకుంటున్న ఆరన్ వింగ్ బోర్డింగ్ సాహస క్రీడల్లో విప్లవమని విశ్వాసంగా ఉన్నాడు.

వింత లోకం

జపాన్‌లోని హొక్కైడో ద్వీపంలోని క్యు-షిరాటకి-షిరాటకి రైల్వే స్టేషన్ ఈ మధ్య బాగా వార్తల్లో వినిపిస్తోంది. అది మంచి విషయానికే. ప్రతి రోజూ ఒకే ప్రయాణీకురాలి కోసం రైలును ఆపుతున్న వైనం అందర్నీ ఆశ్చర్యం కలిగిస్తోంది. అదీ గ్రాడ్యుయేషన్ చేస్తోన్న ఓ విద్యార్థిని కోసం. మంచులో కూరుకుపోయే ఆ స్టేషన్‌లో రైలెక్కేవారు అంతగా లేక ఆ స్టేషన్‌ను ఎప్పుడో మూసేయాల్సి ఉంది. కానీ అక్కడి అధికారులకు ఈ విద్యార్థిని గురించి తెలిసి ఆమె చదువు పూర్తవబోతోన్న మార్చి వరకు ఇలా రోజుకు రెండుసార్లు రైలు ఈ స్టేషన్‌లో ఆ అమ్మాయి స్కూల్ పనివేళలకు అనుగుణంగా ఆగేందుకు నిర్ణయించారు. కానీ దీనిపై దుమారం కూడా రేగుతోంది. అదంతా నిజం కాదని ఆ అమ్మాయి మరో పదిమంది విద్యార్థినిలతో కలసి వేరే స్టేషన్ నుంచి స్కూల్‌కు వెళుతుందని అనేవారున్నారు. ఏదేమైనా ఈ వార్తతో నానాటికీ బిక్కచచ్చిపోతోన్న జపాన్ పల్లెల జనాభా గురించి కొత్త విషయాలు పరిచయమవుతున్నాయి.

నీ కోసం రైలాగిద్ది..

జీవితంపై పేటెంట్

జపాన్‌లో పేటెంట్ రాజుగా యోషినారి నకామత్సును పిలుస్తారు. డాక్టర్ నకామాట్స్ అని కూడా పిలిపించుకునే ఈయన గారు ఇప్పటి వరకు 3500 పేటెంట్లను సంపాదించి రికార్డు సృష్టించాడు. ఇదంతా అయ్యేసరికి ఆయనకు 87 ఏళ్లు నిండిపోయాయి. కానీ ఓ కోరిక మాత్రం అలాగే ఉండిపోయింది. మొత్తం 7000 పేటెంట్లను పొందాలనేది లక్ష్యం. దానికి గాను 144 ఏళ్లు బతికితే చాలని ఎంచక్కా బతికేస్తానని మీడియా ముందుకు కూడా చెప్పి అందరి నోళ్లు తెరిపించాడు. ఏమో ఈ మనిషి తలచుకుంటే అది కూడా సాధించేసి దానికి కూడా పేటెంట్ చేస్తాడని జోక్‌లు వేసేవాళ్లు బోలెడు మంది. కానీ నకామాట్స్ ఎంత పాజిటివ్‌గా ఉన్నా ఆయన ఆశలు నీరుగారేలా ఓ షాకింగ్ న్యూస్ తెలిసింది. 2013లో ఆయన క్యాన్సర్ బారిన పడ్డారు. మరో రెండేళ్లకు మించి బతకలేరని వైద్యులు చెప్పేశారు. కానీ 2016లోకి అడుగెట్టేసి అందర్నీ ఆశ్చర్య పరుస్తున్నాడు.

తిరిగి గుహలోకి..

ఆస్ట్రేలియాకు చెందిన కార్పొరేట్ దిగ్గజం యాంజెలో మాస్ట్రోపీట్రో ఇంటి పేరుకు అర్థం రాతిని తొలవడంలో మాస్టర్ అని. అందుకు కాదు గాని యాంజెలో తిరిగి తన నివాసాన్ని కోట్ల ఏళ్ల నాటి గుహలోకి మార్చుకున్నాడు. నేల మాలిగ ఉష్ణ వ్యవస్థ, వైఫై గట్రా అత్యాధునిక సౌకర్యాలన్నీ ఉన్నాయిలెండి. యాంజెలో 2007లో మల్టిపుల్ స్కెలెరోసిస్ అనే జన్యు సంబంధిత వ్యాధి బారినపడి పాక్షికంగా పక్షవాతానికి గురయ్యాడు. అప్పటి వరకు తాను గడిపిన కార్పొరేట్ జీవితంలో ఏదో లోటు ఆయన్ను ఆ సమయంలో తొలిచేసింది. తన జీవితశైలి చాలా విశృంఖలంగా, విచ్ఛిన్నకరంగా ఉందని, వెంటనే దాన్నుంచి తప్పించుకుని ఏకాంత, ప్రశాంత జీవితానికి పారిపోవాలని మనసు లాగేసేది. అలా 2010లో లండన్‌కు వెళ్లినపుడు ఓ ప్రాపర్టీ లిస్టింగ్ కంటబడింది. నివాసాలుగా మార్చుకున్న 25 కోట్ల ఏళ్ల నాటి పురాతన గుహలు గురించి తెలిసింది. 1999లో ఓ సారి భారీ వర్షాన్ని తప్పించుకునేందుకు ఆ గుహలోనే తలదాచుకున్నాడు. వెంటనే దాన్ని సుమారు 50 లక్షల పెట్టి కొనేశాడు. మరో కోటి రూపాయల వరకు ఖర్చు చేసి దాన్ని ఆధునీకరించాడు.

ఆచూకీ దొరకలేదు

కిక్కిరిసిన ప్లాట్‌ఫాం బ్రహ్మోత్సవాల
తిరుమల కొండను మరపిస్తూవుంది
ఎన్ని భాషలు ఎన్నెన్ని రంగులు
అన్ని భాషల కలయిక లిపిలేని భాషను సృష్టిస్తూంది
త్రిభాషా సూత్రాన్ని పాటిస్తూ
మూడు భాషల్లో ప్రకటనలు వెలువడుతున్నాయి
చెవులు రిక్కించి కొందరు ప్రకటనల్ని
కర్ణంపై ముద్రించుకుంటున్నారు
ఎప్పుడో రాబోయే రైలుకు ఇప్పుడెందుకు ఆరాటమని
దుప్పట్లపై కొందరు సుఖనిద్రకు జారుకున్నారు
క్షణాల్లో రాబోయే రైలుకు కొందరు మునిగాళ్ళ పై నిల్చున్నారు
ఆహ్లాదంగా చుట్టూ మూగి ఒక గుంపు కబుర్లాడుతూ వుంది
శబ్దించని దుఃఖంలో ఒక గుంపు కుములుతూ వుంది
చిత్రాన్నం పొట్లం విప్పి ఒక మూక పంపకంలో నిమగ్నమైంది
ముచ్చట్లలో పెళ్ళి బృందం మునిగిపోగా
వధూవరుల చూపులు బాణాలు విసురుకుంటున్నాయి
ముడిచిన కాళ్ళను నిద్రించేవాళ్ళు
అసంకల్పితంగా చాపుకుంటున్నారు
తగిలిన వాళ్ళు కళ్ళు తెరిచి
అప్రమత్తమై పక్కకు తొలగుతున్నారు
రైలు కూతకు ఉలిక్కిపడ్డ పిల్లల గుండెలపై
తల్లుల చేతులు జోల పాడుతున్నాయి

విద్యుత్తు కొన్ని బల్బుల్ని వెలిగించి
కొన్నిటికి విరామం ప్రకటించింది!
అతను భయం భయంగా వున్నాడు
విషణ్ణ వదనంతో వున్నాడు
పన్నెండు గంటలు దాటిన రాత్రి
ఒంటి గంటలోకి పరుగు తీస్తూవుంది
ప్రపంచాన భారత దేశానిది ముందంజ అంటూ
పది నిముషాల కాలమానం ముందుగా నడుస్తూంది
అతను పరుగు లాంటి నడకతో
ప్లాట్‌ఫాం కలయతిరుగుతున్నాడు
అతని చూపు పరీక్షించని స్థలం లేదు
అతని పాదం మోపని ప్రాంతం లేదు
అడుగులో అడుగు వేస్తూ వచ్చిన రైలుకు
ప్లాట్‌ఫాం స్వాగతం పలికింది
అతను పెట్టె పెట్టెనూ వెతుకుతున్నాడు
ఫలించని ప్రయత్నం నిరాశను కప్పుకుంది
రైలు వీడ్కోలు తీసుకుంది
అతను దుఃఖాన్ని మోస్తూ నిలబడ్డాడు
కదిలిస్తే కన్నీరు వర్షించేలా వున్నాడు!

అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

భావాలను బంధించగలరా..!

ఆలోచనలను
అణచివేయగలరా..!
కెరటాల కేరింతలకు
సంకెళ్ళు వేయగలరా...!
గాలినదుపు చేయగలరా..!
గంగ వెల్లువను దోసిట
చిక్కబట్టగలరా....!
అంతా మతి భ్రమ
మతోన్మాద దుష్కర్మ
వినడానికి విజ్ఞప్తులా
తినడానికి తాఖీదులా...?
గతించిన కాలపు
మతి భ్రమించిన
బూజుపట్టిన విష సంస్కృతిని
అధికార మదమ్ముతో రుద్దుతారా
నిలువెత్తు కుంకుమ బొట్టుతో
నడిబజారున కత్తులు పట్టి
ప్రగతిశీలుర మోముపై
మసిపూస్తారా
స్వేచ్ఛా జీవుల గొంతు కోస్తారా
ఆశావాదుల
హతమారుస్తారా...?
అయినా..........!
మా కలాలు సృజియిస్తాయి
కోట్లాది గొంతుకల వేదనలను,
రోదనలను.
ఆపగలరా.... అక్షరాలను
ఆయుధాలై రణం చేస్తాయి
న్యాయం కోసం, స్వేచ్ఛ కోసం
పోరాడే మా రెక్కలు నరకడానికి
మేం జటాయువులం కాదు
ఝంఝా మారుతాలం.....!
టోర్నడోలమై పైపైకిలేస్తాం....!
అలలమై, అనంతమై
కడలి కెరటాలమై
తుఫాను రూపాలమై
టైఫూన్లమై, టార్పెడోలమై...!
మీ కరుడు గట్టిన కసాయి
కోటలు తాకుతాం...!
బడబాగ్నిలో మాడ్చేస్తాం....!!
నక్క వినయాలతో
కపట రాజనీతితో
కాకులను కొట్టి
గద్దలకు పెట్టే
బూటక భావజాల
వేయి పడగల విష కోరల
చీల్చి చెండాడే
జనమేజయులం......!
మీ దశముఖ వికృత రూపాల్ని
దునుమాడే నరవానరులం....!!
మార్పు కోసం నాటిన విత్తనాలం
ఓ వసంత సుప్రభాతాన
కోటి గొంతుకల రణన్నినాదమై
కల్బుర్గీ కలంలో సిరాయై
దబోల్కర్ నరేంద్రులమై
పన్సారే పసకు
ప్రతిరూపాలమై
శత కోటి తంత్రుల
విద్యుత్తరంగాలమై
వుదయిస్తాం.....!
ఉద్యమిస్తాం........!!

ఒబిలినేని వి.ఆర్
9490099789

తరం మారింది

యలమర్తి అనురాధ
9247260206

నందివర్ధనం చెట్టు మొన్నటి దాకా మోడులా ఒక్క ఆకూ లేకుండా బతికుందా, చచ్చిపోయిందా అన్నట్టుంది. ఇప్పుడు లేత చిగుర్లు వేస్తోంది. నెలాఖరుకంటా పచ్చగా తయారయిపోయింది. మనిషి జీవితం కూడా అంతేనేమో! కష్టం తర్వాత సుఖం. ఆశతో ముందుకు సాగిపోవటమే కదా జీవనమంటే!?!

◆◆◆

వాసంతి, చక్రధర్‌లది అన్యోన్య దాంపత్యం. ఒకరంటే ఒకరు ప్రాణం ఇచ్చేంత అనుబంధం వాళ్ళది. వాళ్ళ ప్రేమకు గుర్తుగా కూతురు ప్రజ్ఞ. ముగ్గురిదీ ఒకే మాట ఒకే బాటగా ఉండేవారు. ఏదైనా కలిసి మెలిసి ఉండటంలో, ఆ కుటుంబం చుట్టు పక్కల వారికి ఎంతో ఆదర్శంగా ఉండేది.

అలా ఉండటం భగవంతుడే సహించలేక పోయాడో ఏమో ఆఫీసులో మీటింగ్ ఉందని హడావిడిగా వెళ్ళిన తను అంతే వేగంగా పైకి వెళ్ళిపోయాడు. అతనెక్కిన లోకల్ ట్రైను పట్టాలు తప్పి యాక్సిడెంట్ జరగటంతో ఎందరో చిన్న పాటి దెబ్బలతో బయటపడ్డారు. దురదృష్టం కొద్దీ చక్రధర్ మాత్రం వాళ్ళిద్దరికీ లేకుండా పోయాడు.

తెల్లారితే ప్రజ్ఞకి పదోతరగతి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్. కార్పొరేట్ స్కూల్స్ కాదు కానీ అందరి కంటే నాలుగడుగులు ముందు ఉండాలని మూడు నెలల ముందే సిలబస్ అవగొట్టెయ్యడం. పరీక్షలు పెట్టి ఎలాగున్నారో చూసుకుని మళ్ళీ రుద్దడం. ఈ పద్ధతి వాసంతికి అసలు నచ్చేది కాదు. ఇంకొకడు పుడితే వాడినన్నా ఈ బరువుల చదువుకు దూరంగా చదివించాలనుకుంది. ఆ అవసరం రాలేదనుకుంది ఇన్నాళ్ళూ. ఇప్పుడిక ఆ ఆలోచనే చేయలేని పరిస్థితిలోకి నెట్టేశాడు దేముడు.

కరెంట్ షాక్ కంటే భయంకరంగా తగిలిందామెకు చక్రధర్ చనిపోవటం. ఊహించని పరిస్థితి.. ఏదో జబ్బుతో తీసుకుని చనిపోయినా కొంత తయారవుతాం కానీ ఇది అలా కాదే. నిన్నటి దాకా తన పక్కన ఉన్న వ్యక్తి ఈ రోజు నిర్జీవంగా.. ఎదురుగా కనిపిస్తున్నది కూడా నిజం కాదనిపిస్తోంది. అబద్ధమో, కలో అయి ఉంటుందని మనసు భ్రమ పడుతోంది. నిజాన్ని ఒప్పుకోవాలనిపించటం లేదు. ఏమిటిది? ఎందుకిలా? ఈ మనిషి ఏడడుగులు తనతో నడిచింది ఇలా మధ్యలో విడిచి పెట్టి పోవటానికేనా? అసలిలా ఎలా వెళ్ళిపోయాడు? తనతో నన్నూ తీసుకెళ్ళి పోతే ఎంత బాగుండేదీ? అనుకుంటూ పక్కకు చూసిన ఆమె హృదయం తరుక్కుపోయింది. దీన వదనంతో ప్రజ్ఞ.

తనూ వెళ్ళిపోతే దీనిని ఎవరు చూస్తారు? అందుకేనా తనను ఇక్కడ వదిలి వెళ్ళిపోయింది. చక్రి, చక్రి ఆక్రోషిస్తోంది మనసు ప్రతి క్షణం. ఏడుస్తున్న ప్రజ్ఞను అక్కున చేర్చుకుంది. ఇద్దరికీ కన్నీళ్ళు ఆగని ప్రవాహంలా వస్తూనే ఉన్నాయి. చుట్టూ ఎందరో ఉన్నా వాళ్ళిద్దరినీ ఓదార్చే ధైర్యం చెయ్యలేకపోతున్నారు. ప్రక్కన కూర్చుని భుజం మీద ఓదార్పుగా తడుతున్నారు.

పరీక్షలు ఎలా రాసిందో ప్రజ్ఞకే తెలియలేదు. వారిద్దరికీ ఒకే ప్రశ్న నాన్న లేకుండా కూడా బతికేస్తున్నామా అని ప్రజ్ఞకు, చక్రి లేకుండా తను ఎలా ఉండగలుగుతోందని వాసంతికి.

పోయిన వాళ్లతో అందరూ పోలేరుగా. బతికున్న వాళ్ళు వాళ్ళ జ్ఞాపకాలతో బతకాలంతే.

ఆచారాలను పాటించే 'పావనమ్మ' వాసంతికి తెల్ల చీర చుట్ట బెడతానంటే ఎదురు తిరిగింది చెల్లి లాస్య.

ఈ కాలంలో ఎవరూ అలా చీరలు కట్టటం లేదు. చిన్నప్పటి నుంచీ ఉన్నవి ఎందుకు తీసెయ్యాలి. గాజులు, బొట్టు, పూలు ఏదీ తియ్యడానికి వీలులేదని హఠం వేసింది.

"సమాజం నవ్వుతుందే!'

"నవ్వనీ అమ్మా! ఎలా ఉన్నా నవ్వటమే దాని పని. ఈ విషయంలో నేనూరుకోను"

"అందరికీ మీరే సమాధానాలు చెప్పుకోండి. నేనిలాంటివి చూడలేను. అసలే నా కూతురు ఇలా అయ్యిందే అని బాధలో ఉన్నాను" అనుకుంటూ

లోపలికి వెళ్ళిపోయింది.

వాసంతికి నిరాసక్తత ఆవహించింది.

వారు మాట్లాడుకుంటున్నది తన గురించే అన్న ధ్యాస కూడా లేదు. ప్రతి నిమిషం చక్రి ఆలోచనలు ఆమెను చుట్టుముడుతున్నాయి. వాటితో ఆనంద పడాలో, బాధ పడాలో తెలియనట్లు ఓ నిర్వికారమైన నవ్వు ఆమె పెదాల మీద విరిసి మాయమయ్యింది.

చక్రి ఉద్యోగం వాసంతికి రావడంతో ఆర్థికంగా లోటు లేకపోయింది. కానీ చక్రి లేని లోటు అనుక్షణం వాళ్ళిద్దరినీ కుదిపేస్తోంది. ఒకరికొకరు మౌనంతోనే ఓదార్చుకుంటున్నారు.

నలభై ఏళ్ళకే వైధవ్యమా? ఎలా జీవితమంతా ఒంటరిగా గడుపుతుంది. పావనమ్మ బాధ రోజురోజుకీ అధికమౌతోంది. అలాగని వేరే పెళ్ళి చెయ్యలేంగా!

ఎందుకు చేయకూడదు ఎదురు తిరిగింది ఆమె అంతరాత్మ.

అసలు ప్రజ్ఞ, వాసంతి ఒప్పుకుంటారా?

చక్రి కన్నా మంచి వాడు దొరుకుతాడా?

లేదంటే పెనంలోంచి పొయ్యి లోకి పడిన పరిస్థితి అవుతుందిగా.

మనసులో మాట వాళ్ళిద్దరి ముందు బయట పెట్టాలంటే భయం.

ప్రజ్ఞ మరొకరిని తండ్రిగా అంగీకరిస్తుందా?

అసలు తను ఈ పని చెయ్యగలదా?

సందేహం ఉన్నా ఆవిడ కళ్ళు అన్వేషిస్తూనే ఉన్నాయి.

అలా రెండేళ్ళు గడిచిపోయాయి.

ప్రజ్ఞ ఇప్పుడు ఇంటర్. ఎంసెట్ పరీక్షలు రాస్తోంది. మంచి ర్యాంక్ వస్తే ఇంజనీరింగ్ చదివి తండ్రి కోరిక తీర్చాలని ఉందామెకు.

◆◆◆

వయసులో ఉండే వాళ్ళకు ఉండే బాధలన్నీ తప్పటం లేదు వాసంతికి. భర్త చనిపోయిన ఆడది అంటే అందరికీ లోకువే. ముఖ్యంగా మగవాళ్లకి. వెకిలి మాటలు. వెకిలి చేష్టలు.

ఆఫీసులోనూ! ఇంటి దగ్గరా!

రోజూ చూపుల యుద్ధాలే!

తన పని ఏమిటో తాను చేసుకుపోయే వాసంతికి కూడా ఈ తిప్పలు తప్పలేదు.

అమాయకంగా కనిపించే ఆమె కాస్త చనువు తీసుకోవాలని చూసే వాళ్ళని చూపులతోనే ఆమడ దూరంలో నిలబెట్టేది. కాదని నాలుగు అడుగులు ముందుకు వేస్తే దుర్గాదేవి అవతారం ఎత్తేది.

ఆ మాట ఆనోటా ఆనోటా పాకి ఇక పాత వాళ్ళెవరూ సాహసం చెయ్యకూడదని బుద్ధి తెచ్చుకున్నారు.

తెలియని వాళ్ళు తెలుసుకునే వాళ్ళు.

అలా మరో నాలుగు కేలెండరులు కదిలిపోయాయి.

ప్రజ్ఞకు ఓ ఎమ్మెన్సీలో జాబ్ వచ్చింది.

ప్రజ్ఞ ఆలోచనలన్నీ తల్లి గురించే.

ఎన్నాళ్ళు అలా ఒంటరిగా ఉంటుంది?

అందరూ అనుకునేట్లు వేరే వ్యక్తి తనింట్లోకి ప్రవేశిస్తే తను పరాయిదయిపోతుంది అనుకోలేదు.

అమ్మకో తోడు ఏర్పరచాలనుకుంది.

వెదుకులాట ప్రారంభించింది.

ఎందరి పెళ్ళిళ్లో జరిగిపోతున్నాయి. కానీ తన తల్లికి సరైన జోడు కనిపించటం లేదు.

ఇక ప్రజ్ఞకి పెళ్ళి చేసెయ్యాలనుకుంది వాసంతి.

అదే మాట అందామెతో.

"నువ్వు చేసుకుంటానంటేనే నేను చేసుకుంటా!" అని తెగేసి చెప్పింది.

"ఈ వయసులో నాకు పెళ్ళేంటి! నీకేమైనా పిచ్చి పట్టిందా?" అన్న తల్లి మాటలకు..

"నువ్వు ఏమన్నా అనుకోమ్మా" ఈ విషయంలో మాత్రం నన్ను మార్చాలని ప్రయత్నించకు. లేదంటే జీవితాంతం నీకు తోడుగా ఉండిపోతాను. పెళ్ళి మాటైనా ఎత్తకు"

"అవేం మాటలే" తల కొట్టుకుంది వాసంతి.

తనకు మళ్ళీ ఈ కొత్త సమస్య తెచ్చిపెట్టిందే పిల్ల. అసలే మొండిది. ఎలా దీనిని మార్చటం. ఈ విషయంలో ఎవరిని సంప్రదించాలి? తన బాధను తాను దిగమింగుకోవటమే తప్ప ఎవరితోనూ ఇప్పటి వరకూ పంచుకునే సాహసం చెయ్యలేదు.

ఇంతలో 'అక్కా'!... అంటూ వచ్చింది హైమా.

"రా హైమా! " అంటూ ఆహ్వానించింది.

ఆమె భర్త పక్క సందులో బిల్డింగ్‌కి పెయింట్ వేస్తూ పైనుంచి పడి చనిపోయాడు.

చదువుకోని హైమ నడిరోడ్డులో నిలబడింది.

ఇంత పెద్ద ఇల్లు తనేం చేసుకుంటుందని వాళ్ళకి రెండు రూములు ఇచ్చింది. అద్దె వద్దని చెప్పింది. ఆమె కొడుకును తనే చదివిస్తోంది. ఓ బట్టల షాపులో పని చేస్తూ తిండికి లోటు లేదనిపించుకుంటోంది హైమ.

ఆ రోజు ఆదివారం కాబట్టి ఓ పది నిమిషాలు మాట్లాడుదామని వచ్చింది.

"అక్కా! ఏం పాపం చేసుకున్నామో ఇద్దరికీ ఒకే రకం శిక్ష వేశాడు ఆ భగవంతుడు. ఆయనకు చెప్తూనే ఉండేదాన్ని ఆ తాళ్ళు వేసుకుని అటూ ఇటూ రంగు డబ్బాలు తగిలించుకుని గోడలకు రంగు వేస్తుంటావు జాగ్రత్త. పడిపోతే మాకు దిక్కెవరు? అని అడిగేదాన్ని."అంది హైమా.

"ఒసి వెర్రి మొఖమా! ఆ ఎదురింటాయన బాత్రూమ్‌లో కాలు జారి పడి ఇంట్లోనే పోయాడు. దానికేమంటావు? బతుకు భయం పెట్టుకుంటే మనం ఏ పనీ చెయ్యలేం. ఇప్పటికిప్పుడు గుండె నొప్పి వస్తే ఏం చెయ్యగలం? మనకి ఈ భూమి మీద ఎన్ని నూకలు ఉంటే అన్నాళ్ళే ఉంటాం. ఆ క్షణం దాటాక ఉండమన్నా ఉండలేం. చావు రాయకుంటే పొమ్మన్నా పోలేం. అలాంటి పిచ్చి ఆలోచనలు చెయ్యమాకు" అని నన్నే తిట్టేవాడు. చివరకు నన్నిలా అన్యాయం చేసి వెళ్ళిపోయాడు. నా బతుకు ఒంటరి బ్రతుకు అయిపోయింది".అని కొనసాగించింది. "ఏం చేస్తాం.. అనుభవించక తప్పదుగా" అంది వైరాగ్యంగా వాసంతి.

"మా బట్టల ఫ్యాక్టరీలో ప్రభాకర్ నన్ను పెళ్ళి

చేసుకుంటానంటున్నాడు. నా కొడుకుని వద్దన్నా వినకుండా అడిగేశాడు. అంతే తారాజువ్వలా ఎగిరి పడ్డాడు వాడు.

నేను పెళ్ళి చేసుకుంటే వాడు ఆత్మహత్య చేసుకుంటాడట".అని ముక్తాయించింది.

అప్పుడుగానీ వాసంతికి అర్థం కాలేదు ప్రజ్ఞ ఎంత ఎదిగిపోయిందో?

నిర్ణయాన్ని కాలానికే వదిలెయ్యమని సలహా ఇచ్చింది హైమకు. 'తనూ అదే చేస్తుందా?' మనసులోనే ప్రశ్నించుకుంది.

కొత్తగా తమ కంపెనీకి బాస్‌గా వచ్చిన 'వర్ధమాన్' ఎందుకో ప్రజ్ఞకు బాగా నచ్చాడు. ఇక అతనిని గమనించటం ప్రారంభించింది.

ఓ ఆరునెలల పరిశోధనలో అతను అమ్మకి తగినవాడు అని నిర్ణయించుకుంది. అతని భార్య 'క్యాన్సర్' జబ్బుతో చనిపోయిందట. అప్పటి నుంచీ పెళ్ళి చేసుకోలేదట. చేసుకునే ఉద్దేశం కూడా అతనికి లేదని వింది.

అతనితో చనువు పెంచుకుని పెళ్ళికి ఒప్పించగలిగే స్థాయికి తీసుకు వచ్చింది. ఈ లోపు వీళ్ళిద్దరికీ ఏదో కథ నడుస్తోందని పుకార్లు పుట్టించేశారు పనిలేని ఉద్యోగులు.

అందుకే ఇక తెర దించెయ్యాలని నిర్ణయించుకుంది.

ప్రజ్ఞ మొండి పట్టు, వేధిస్తున్న ఒంటరి తనం ఇక వాసంతిని 'అవును' అని చెప్పించాయి.

వర్ధమాన్ స్నేహితుడి కొడుకు నిరంజన్ ప్రజ్ఞని ఇష్టపడ్డాడు.

ఇంకేముంది? ముందు అమ్మ పెళ్ళి తర్వాత నా పెళ్ళి అనేసింది ప్రజ్ఞ.

రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుని దంపతులయ్యారు వాసంతి, వర్ధమాన్.

నిండైన బొట్టుతో చేతినిండా గాజులతో, కళకళలాడుతూ ఉన్న తల్లిని చూస్తుంటే కడుపు నిండిపోయింది ప్రజ్ఞకు.

ఏమిటో పెళ్ళి చేసుకుంటే వితంతువుకి ఇవన్నీ వచ్చేస్తాయా?

ఏం సాంప్రదాయాలు?

మళ్ళీ మగవాడికి అలాంటివి ఏమీ ఉండవు.

ఇవన్నీ ఒక్క ఆడదానికే!

తన ఆలోచనలకు తనే నవ్వుకుంటూ ఏమైతేనేం తన కోరిక తీరింది. అమ్మ పెళ్ళి చేసేసింది. ఈ విషయంలో తనకు తోడుగా నిలిచిన నిరంజన్‌కి కళ్ళతోనే ధన్యవాదాలు అందించింది.

✦

తెలుసా!

అంటార్కిటికాకు చెందిన ఎంపరర్ పెంగ్విన్ తీవ్రమైన చలిలోనూ తన గుంపు మధ్యలో ఉన్నప్పుడు 37.5 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణాన్ని కలిగి ఉంటుంది.

చెర్నోబిల్ దుర్ఘటనలో అణుధార్మికతకు గురైన అడవి పందులు జర్మనీలోని అడవుల్లో ఇప్పటికీ తిరుగుతున్నాయట.

రెండో ప్రపంచ యుద్ధం ముందు ఎంత జనాభా ఉందో ఆ స్థాయిని లండన్ మళ్లీ 2015 జనవరి నాటికి చేరుకోగలిగింది.

స్క్రీన్‌పై చుట్టను స్టైల్‌గా తాగుతున్నట్టు కనిపించే హాలీవుడ్ స్టార్ క్లింట్ ఈస్ట్‌వుడ్ నిజజీవితంలో ఎప్పుడూ పొగతాగలేదు.



సినిమాల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడానికి హాలీవుడ్‌కు ఓ ఆలోచన వచ్చింది. సైన్స్ సంగతులపై వివరాల కోసం ఫిలిమ్ మేకర్స్ నేరుగా శాస్త్రవేత్తల్ని సంప్రదించేందుకు ఓ హాట్‌లైన్ ఉంది.

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్య ంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణా మాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధా న్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగిం చినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

ఎగ్ బిర్యాని



కావలసిన పదార్థాలు

బాస్మతి బియ్యం - 2 కిలో
ఉడికించిన కోడిగుడ్లు - 8
నూనె - 4 టేబుల్ స్పూన్లు
నీళ్ళు - 3 గ్లాసులు
ఉల్లిపాయలు -2 పెద్దవి
అల్లం, వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు
పలావ్ ఆకులు - 2
దాల్చిన చెక్క - చిన్నది
యాలకులు - 4
పసుపు-1/2 టీ స్పూన్
కారం -1 టీ స్పూన్
గరం మసాలా పొడి- 1 టీ స్పూన్
కొత్తిమీర తురుము - 1/2 కప్పు
ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందుగా బాణలిలో నూనె లేదా నెయ్యి వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేయాలి. రెండు నిమిషాల తర్వాత పలావ్ ఆకు, దాల్చిన చెక్క, యాలకులు వేసి బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. తర్వాత కోడి గుడ్లు, కారం, పసుపు వేయాలి. కోడిగుడ్లు రంగు మారాక ఒక పాత్ర తీసుకుని బియ్యాన్ని వేసి నీళ్ల పోయాలి. కొన్ని నిమిషాల తర్వాత బాణలిలో వేయించిన మిశ్రమం, ఉప్పు గరం మసాలా పొడి వేసి మూత పెట్టాలి. మీడియం మంట మీద ఉడికించి నీరంతా ఆవిరయ్యాక పొడిపొడిగా ఉన్న బిర్యానిపై కొత్తిమీర తురుము చల్లుకుని దించేసుకోవాలి. అంతే ఎగ్ బిర్యాని రెడీ.

ఎగ్‌తో ఎక్స్‌ట్రాగా...

కోడిగుడ్డు మునక్కాయ పులుసు



కావలసిన పదార్థాలు

మునక్కాయలు - 4
కోడి గుడ్లు - 5
ఉల్లిపాయలు - 3
చింత పండు - 20 గ్రాములు
అల్లం, వెల్లుల్లి ముద్ద - 2 టీ స్పూన్లు
కరివేపాకు - రెండు రెబ్బలు
ఉప్పు - తగినంత
ఎండు మిరపకాయలు - 2
జీలకర్ర - 1/2 టీ స్పూను
ఆవాలు - 1/2 టీ స్పూను
నూనె - సరిపడా
కొత్తిమీర - 1కట్ట

తయారుచేసే విధానం

కోడి గుడ్లని ఉడికించి పెచ్చు తీసి పక్కన పెట్టుకోవాలి. మునక్కాయలపై పొట్టు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. మిక్సీలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం, వెల్లుల్లి వేసి మెత్తగా రుబ్బుకోవాలి. చింతపండుని ఒక గిన్నెలో నానపెట్టుకోవాలి. స్టౌ మీద మందపాటి గిన్నె పెట్టి సరిపడా నూనె వేసి అందులో ఉడికించిన గుడ్లని వేసి ఎర్రగా వేయించుకోవాలి. వాటిని తీసిన నూనెలో ఉల్లిపాయ ముద్ద వేసి వేగించాలి. అందులో ఉప్పు, పసుపు, కారం వేసి బాగా కలపాలి. ఇందులో మునక్కాయ ముక్కలు కూడా వేసి కలిపి ఐదు నిమిషాలు వేగించాలి. తరువాత నానబెట్టిన చింతపండులో ఒక గ్లాసు నీళ్ళు పోసి గుజ్జు తీయాలి. ఈ నీళ్ళని కూరలో పోసి కొంత సేపు ఉడికించాలి. మునక్కాయ ముక్కలు మెత్తపడ్డాక కొత్తిమీర తురుము వేసి దింపేయాలి.



కావలసిన పదార్థాలు

గుడ్లు - 2
బ్రెడ్ ముక్కలు - 2
బీన్స్ ముక్కలు - 1 టేబుల్ స్పూను
పచ్చిమిరపకాయలు - 2
మిరియాల పొడి - 1/2 టీ స్పూను
పసుపు - చిటికెడు
ఉప్పు - తగినంత
నూనె - సరిపడా

తయారుచేసే విధానం

ముందుగా గుడ్డు సొనని మిక్సీలో వేసుకోవాలి. ఒక గిన్నెలో సన్నగా తరిగిన బీన్స్ ముక్కలు, ఉల్లిపాయలు, బ్రెడ్ పొడి, పచ్చి మిరపకాయ ముక్కలు, మిరియాల పొడి, పసుపు, ఉప్పు, మిక్సీలో వేసిన గుడ్డు సొన వేసి బాగా కలపాలి. స్టౌ మీద పెనం పెట్టి సరిపడా నూనె పోసి పలచగా ఆమ్లెట్ వేయాలి. ఆమ్లెట్ వేగాక నచ్చిన ఆకారంలో మడవాలి. దీన్ని టమోట సాస్‌తో తింటే చాలా రుచిగా ఉంటుంది.

రోల్డ్ ఆమ్లెట్

ఎగ్ బజ్జీ



కావలసిన పదార్థాలు

కోడిగుడ్లు - 5
శెనగపిండి -పావు కేజీ
తినే సోడా - చిటికెడు
ఉల్లిపాయ ముక్కలు - 1 కప్పు
బజ్జీ మసాలా - 1 టేబుల్ స్పూను
కొత్తిమీర - 1 కట్ట
ఉప్పు - తగినంత
నూనె - సరిపడా

తయారు చేసే విధానం

గుడ్లని ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో శెనగపిండి వేసి తగినంత ఉప్పు, తినే సోడా వేసి జారుగా కలుపుకోవాలి. స్టౌ మీద కడాయి పెట్టి సరిపడా నూనె పోసి బాగా కాగాక ఉడికించి పెట్టుకున్న గుడ్డుని పిండిలో ముంచి నూనెలో వేయాలి. ఎర్రగా వేగాక తీసి పేపర్‌పై వేసుకోవాలి. ఎగ్ బజ్జీని మధ్యలో కట్ చేసి ఉల్లిపాయ ముక్కలు, బజ్జీ మసాలా వేసి కొత్తిమీరతో అలంకరించుకోవాలి.

జత చేయండి

పిల్లలు ఇక్కడ వివిధ రకాల ఉద్యోగులు, వారు చేసే పనులు ఇచ్చాం. ఎవరు ఏ పనులు చేస్తారో జతచేయండి.

బుజ్జి స్టార్

చిన్నప్పుడు నేనొక 'లిటిల్ సోల్జర్' ని. ఇప్పుడు తెలుగు సినిమా హీరోని.. నేనెవరినో చెప్పుకోండి!

వేళ్లతో జింక

ఆర్టిస్ట్ అంకుల్ చేతివేళ్ళ నీడతో జింక బొమ్మ చేశాడు. చీకటి గదిలో కొవ్వొత్తి వెలిగించి మీరూ ప్రయత్నించండి.



చుక్కలు కలిపేద్దాం

త్వరగా చుక్కలు కలిపి ఈ బొమ్మకు మంచి పేరు పెట్టండే!



సరైన అంకె

మీకు కూడికలు బాగా వచ్చుట కదా. మరైతే ఈ అంకెలను గమనించండి. ఆ తర్వాత జాగ్రత్తగా ఆలోచించి మధ్యలో ఖాళీని పూరించండి. ఒకే గీతపై ఉన్న రెండు వృత్తాల్లో వున్న అంకెలను కలిపితే మూడవ వృత్తంలో అంకె రావాలి. అప్పుడు మీరు సరైన సమాధానం రాసినట్టు లెక్క.



పదాలు కనిపెడదాం

1	ముల్లు	కం	ట	కం
2	పురుగు	కీ	ట	కం
3	అవరోధం			కం
4	ఎలుక			కం
5	పుట్ట			కం
6	ఎక్కువ			కం
7	హస్తభూషణం			కం
8	దోమ			కం
9	బంగారం			కం
10	నక్క			కం



స్కేట్ (కి)ంగ్

ఏడేళ్ల వయసులో పిల్లలు సహజంగా ఏం చేస్తుంటారు?ఆటలాడుతూ, ఇల్లంతా అల్లరిగా తిరుగుతూ బొమ్మలు గీస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి టీ.వీ చూస్తూ ఉంటారు. మణిపూర్‌కి చెందిన తిలక్ మాత్రం వీళ్లకు భిన్నంగా స్కేటింగ్ చేస్తూ కనిపిస్తాడు. ఏడేళ్ల తిలక్ రోజూ ఏడు గంటలు స్కేటింగ్ ప్రాక్టీస్ చేస్తాడంటే అశ్చర్యంగా వుంది కదూ! రెండేళ్ళ క్రితం లింబోస్కేటింగ్‌లో అడుగుపెట్టిన తిలక్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఢిల్లీలో సిరి ఫోర్టు స్టేడియంలో డిసెంబరు 20న 100 మీటర్ల లింబో స్కేటింగ్ పోటీల్లో గిన్నిస్ రికార్డు నెలకొల్పాడు. స్కేటింగ్ వేగాన్ని పెంచుతూ రెక్కలు చాపిన పక్షిలా తిలక్ తన శరీరాన్ని మలచుకొని పైపుల కింద నుంచి స్కేటింగ్ చేస్తూ యూటర్న్ తీసుకున్న తీరు అందరినీ ఆశ్చర్య పరుస్తుంది. స్కేటింగ్ సాహసాలతో 2015 లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు కూడా ఎక్కాడు మన బుల్లి తిలక్. రెండో తరగతి చదువుతున్న తిలక్ స్కేటింగ్‌తో పాటు డ్రాయింగ్, పెయింటింగ్, నేషనల్ సైన్స్ ఒలంపియాడ్‌లోనూ పతకాలు గెలుచుకున్నాడు. ఇలా బహుముఖంగా తను సాధించిన పతకాలు 42కు చేరాయి. ఇక రాబోయే ఒలంపిక్స్‌లో పథకాన్ని గెలుచుకోడానికి తిలక్ తన ప్రాక్టీస్ అప్పుడే మొదలుపెట్టేశాడు.

కొంటె ప్రశ్న

గడియారంలో పదమూడు గంటలు కొడితే అది ఏ సమయం?



రిపేరు సమయం

జవాబులు:
పదాలు కనిపెడదాం:
కంటకం, కీటకం, ఆటంకం,
మూషికం, వాల్మీకం,
అధికం, పుస్తకం, మశకం,
కనకం, జంబూకం
సరైన అంకె: 8
బుజ్జిస్టార్: బాలా ఆదిత్య

నిశ్శబ్ద పట్టు



ప్రత్యేకం

గూంగా పెహల్వాన్ దేశానికి తొలి స్వర్ణాన్ని అందించిన డెఫలింపిక్స్ విజేత. ఒలంపిక్స్‌లో పతకం సాధించాలని పట్టు పట్టిన మల్ల యోధుడు. పరిచయం చేశాక తెలియని ఈ కొత్త పేరు వినగలగడం వెనుక చాలా కసరత్తు జరిగింది. సుశీల్ కుమార్ సైతం తన స్థాయి వాడన్న ఈ గూంగా ఒలంపిక్స్ బరిలో నిలుస్తాడా? అడ్డంకి ఏమిటి? ఇంతకీ ఈ గూంగా ఎవరు? ఈ నిశ్శబ్ద కుస్తీ పట్టు బిగుస్తుందా?

హర్యానాలోని ఓ గ్రామంలో విశాల దంగాల్ మైదానం. కుస్తీ, మల్ల యుద్ధ పోటీలకు అంతా సిద్ధం. అడ్రినలిన్ రష్‌తో ఊగిపోతున్న జనం. అక్కడ వీరుల మహా సంగ్రామం జరుగుతున్నట్టు తెలిసేలా కిలోమీటరు దూరం వరకు వినిపించే అరుపులు, ఈలలు. అక్కడకు ఒక్కసారిగా వెళితే చెవులు హోరెత్తి ప్రపంచం మూగబోతుందేమో. ఈలోగా. వేదిక వద్దకు జబ్బలు చరుచుకుంటూ మట్టిని చేతుల్తో పిండేస్తూ గూంగా పెహల్వాన్ వచ్చాడు. అంతర్జాతీయ మేటి క్రీడాకారుడే అయినా స్థానిక కుర్రాడిగానే అక్కడివారికి ఎక్కువ తెలుసు. జనసంద్రం ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోతుంది. మళ్లీ లిప్తకాలంలో మళ్లీ మబ్బులు పెళపెళలాడినట్టు కరతాళ ధ్వనితో స్వాగతం. రెట్టించిన మాస్ హిస్టీరియా. ధ్వనుల్లో ఇన్ని మార్పు చేర్పులు జరుగుతుంటే కొత్తవారికి తల తిరుగుతుంది. చెవుల్లో హోరు ఇంటికొచ్చాక కూడా వదలదు. కానీ గూంగా పెహల్వాన్‌కు ఇవేమీ వినిపించవు. అంతా నిశ్శబ్దమే. తాను ప్రశాంతంగా ప్రత్యర్థిని మట్టి కరిపిస్తుంటే.. ఆ చుట్టుపక్కలంతా ఓ పెద్ద తుఫాను చెలరేగుతుంటుంది.

గూంగా (చెవిటి) పెహల్వాన్‌గా పిలవబడే వీరేంద్ర సింగ్‌కు ఇంత పరిచయం ఎందుకంటే తానో మూగ, చెవిటి క్రీడాకారుడు. పోటీ పడి పోరాడేది ఏ ఇబ్బంది లేని సాధారణ పెహల్వాన్‌లతో. ఎంతో కీలకమైన జడ్జి విజిల్ శబ్దాలు, పదాలు వినిపించవు. తను విజేతగా నిల్చినప్పుడు ఆలపించే జాతీయ గీతం కూడా అతనికి వినిపించదు. కేవలం పట్టు మార్చే ప్రత్యర్థి చేతికి, ఫౌల్ చెప్పే జడ్జి చేతి తాకిడికి తేడా తెలియాలి. పసిగట్టి లిప్తకాలంలో పొజిషన్ మార్చుకోవాలి. లేకుంటే పట్టు జారుతుంది, ఆట అదుపు తప్పుతుంది, ఓటమి వెర్రిగా నవ్వుతుంది. ఈ హోరాహోరీ అంతా కూడా 5-10 వేల ప్రైజ్ మనీ కోసమే. దేశానికి తొలి స్వర్ణాలు అందించిన క్రీడాకారులకు కోట్ల రూపాయలతో ముంచెత్తితే. గూంగాకు 3-4 లక్షలిచ్చి చేతులు దులుపుకున్నారు. అవి సాధిస్తేనే అంతర్జాతీయ పోటీలకు సాధన చేసే వీలు. గొప్పలు పోయే క్రీడా ప్రాధికార సంస్థల నుంచి మాటలే కానీ అత్యవసరాలూ అందవు. క్రీడాకారునిగా ఈ మనుగడ పోరాటంలోను తానే కుస్తీపాట్లు పడాలి. తాను ఆడిన ప్రతి అంతర్జాతీయ పోటీలోను సత్తా చాటిన గొప్ప క్రీడాకారుడి రోజూవారీ కసరత్తు ఇది. బధిరుల ఒలంపిక్స్‌లో (డెఫలింపిక్స్)లో భారత్‌కు తొలి స్వర్ణాన్ని అందించిన మేటి క్రీడాకారుని అవస్థ ఇది.

వినిపించిందిలా...!

అప్పటి వరకు ఎక్కడా వినిపించని ఇతడి పేరు 2005 ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన డెఫలింపిక్స్ ద్వారా అతడి గ్రామం దాటి దేశానికి పరిచయమైంది. అంతర్జాతీయ మీడియానే ఆ పేరును గొప్పగా ప్రాజెక్ట్ చేసింది. బరిలోకి దిగిన తొలి డెఫలింపిక్స్‌లో స్వర్ణాన్ని గెలిచాడు. గూంగా పెహెల్వాన్ ఆ తర్వాత వరసగా ఆర్మేనియాలోని యెరవాన్ ప్రపంచ చాంపియన్‌షిప్ (2008)లో రజతం, తైవాన్‌లోని సోఫియా డెఫలింపిక్స్ (2009)లో కాంస్యం, బల్గేరియా ప్రపంచ చాంపియన్‌షిప్ (2013)లో కాంస్యంతో దేశ పతాకాన్ని రెపరెపలాడించాడు. అయినా స్పందన నామ మాత్రమే. సూదిపై కూడా పుంఖానుపుంఖాల సమాచారాన్నిచ్చే గూగుల్‌లో అప్పట్లో పెహల్వాన్ వీరేంద్ర సింగ్ అని కొడితే సెర్చ్ చెక్ అయ్యేది.

ఇదీ లక్ష్యం

ఇంత నిరుత్సాహ పరిస్థితుల్లోను పదేళ్లుగా రాజీలేని పోరాటంతో నెట్టుకొస్తున్న ఈ క్రీడా వీరుడిదో లక్ష్యం. దంగాల్స్ దుమ్ము, ధూళిలోనే తన కీర్తి పడి కొట్టుకు పోకుండా ఒలంపిక్స్‌లో స్వర్ణాన్ని సాధించి శాశ్వత ముద్ర వేయాలి. తనకిప్పుడు 33 ఏళ్లు నిండాయి. వచ్చే 2016 రియో ఒలంపిక్స్ జట్టులో చోటు కావాలి. కానీ క్రీడాధికారులు వీరేంద్రకు అర్హత లేదని పెద్ద దెబ్బ కొట్టారు. కానీ బధిర క్రీడాకారులు కూడా సాధారణ పోటీదారులతో తలపడొచ్చనేది ఒలంపిక్స్ స్ఫూర్తి. దీన్ని ఇక్కడి కమిటీ పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు. గూగుల్‌లో పేరే వెతకలేని ఈ అన్‌సంగ్ హీరోకు మద్దతు నిలిచేదెవరు. ఈ విషయాన్ని తెలుసుకునే ఢిల్లీకి చెందిన కొందరు యువకులు అతడి జీవితంపై గూంగా పెహల్వాన్ అనే చిత్రాన్ని తీసి అంతర్జాతీయ చిత్ర వేడుకల్లో, యూట్యూబ్‌లో, ప్రత్యేక ప్రదర్శనల ద్వారా దేశమంతా చూపించే ప్రయత్నం చేశారు. అలా వీరేంద్ర కాస్త 'గూంగా పెహల్వాన్'గా నోటెడ్ అయ్యాడు. ఒలంపిక్స్‌లో భారత కలల్ని సాకారం చేసిన మరో మల్లయోధుడు సుశీల్ కుమార్‌తో కలిసి ప్రస్తుతం ఛత్రసాల్ స్టేడియంలో కసరత్తులు చేస్తున్నాడు. సుశీల్ కూడా తోడు నిలిచి వీరేంద్ర ప్రాతినిథ్యం కచ్చితంగా ఉండాల్సిందేనంటూ పలు వేదికల్లో స్వరం కలిపాడు. ఒలంపిక్స్‌కు సిద్ధమయ్యే మల్లయోధుల ఆరోగ్యం, ఆహారం, శిక్షణ, ప్రయాణ ఖర్చులు అతి భారీగా ఉంటాయి. అందుకే ఇంకా హర్యానా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీల్లో నిర్వహించే స్థానిక దంగాల్స్‌లో జబ్బలు చరుస్తూనే ఉన్నాడు. ఇదే అనుభవం తనకు పదహారేళ్ల వయసులోను ఎదురైంది. ప్రపంచ కాడెట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్టే అయ్యి అధికారుల తీరుతో అవకాశం కోల్పోయాడు. అప్పట్లో వీరేంద్ర అంటే మామూలు క్రేజ్ కాదు. ప్రపంచాన్ని నివ్వెరపరిచిన పెహల్వాన్ గ్రేట్ గామా చిన్న తమ్ముడిని చిరుప్రాయంలోనే ఓడించి విజేతగా నిలిచాడు. కేవలం బధిరుడు అనే కారణంతో వెనక్కు పంపించడంతో ఆ గ్రామం కూడా అవమానంగా భావించింది. ఎందుకు పోరాటం ఆపలేదంటే తనలాంటి చాలామంది తమ బలమేంటో తెలుసుకోకుండా అక్కడే ఆగిపోతారు. తను వారికి ప్రాతినిథ్యం వహిస్తూ విజయం రుచి చూపిస్తే పెను మార్పులు సృష్టిస్తారు.. అని అంటాడు.

✦



అనంతంలో అంతా...

చిన్నారికి నీకేంటి తేడా. కాంక్రీట్ అరణ్యాల్లో చిక్కుకుపోయినా, తరగతి గది బ్లాక్‌బోర్డుల్లోకి చొచ్చుకుపోయినా, లక్ష్యం లేని ఆటలో మునిగిపోయినా ఏదో వెతుకులాడుతుంటారు. లోలోతుల్లో ఏదో ఆలోచనల్లో తచ్చాడుతుంటారు. అంతే లేని 'వాయిడ్'లలోకి తల దూర్చేస్తారు. ఆ విషయంలోనైతే నాకు చిన్నారికి ఏ తేడా లేదు. అసలు ప్రపంచంలోని ఏ బుజ్జాయికి కూడా ఈ విషయంలో తేడా రాదు. పారిస్ స్ట్రీట్ ఆర్టిస్ట్ జూలియన్ మల్లాండ్ భావాలివి. ఊరు ఊరునా తిరుగుతూ తన క్రియేటివ్ కంటి చూపుకు నోచుకోవడానికి జాలిగా ఎదురుచూసే వీధి వీధిని తన కుంచెతో పలకరిస్తాడు జూలియన్. 'సేత్ ది గ్లోబ్‌పెయింటర్'గా భూమిని చుట్టొచ్చే జూలియన్ తనను చిట్టి పాపాయిల బొమ్మల్లో చూయించుకుంటాడు. వారు ఎంత తీవ్రంగా అనంత జిజ్ఞాసలో మునిగిపోతారనే విషయాన్ని చెప్పేందుకు మోము కనిపించకుండా రంగుల అనంతాల్లో దాచేస్తాడు. భారత్, చైనా, వియత్నాం, బ్రెజిల్ వంటి దేశాల్లోని మారుమూలల్ని జల్లెడపట్టి తనదంటూ ఓ ఫిలాసఫీ గ్రాఫిటీలో కొట్టుకుపోతున్న జూలియన్ ఆ దేశాల సంస్కృతిని పిల్లల లోకంలో రంగులుగా జల్లుతుంటాడు. పారిస్‌లోని నేషనల్ స్కూల్ ఆఫ్ డెకొరేటివ్స్ ఆర్ట్స్‌లో పట్టా పొందిన జూలియన్ 1990 నుంచి తన గ్రాఫిటీలు, స్ట్రీట్ ఆర్ట్‌లతో అనంతంలోనే అంతా చూసు కుంటున్నాడు.

★







బెంగాలీ బహురూపులు

బహు అంటే అనేక. రూపు అంటే అవతారం. రెండు పదాలు కలిపితే అనేక అవతారాలు అన్న అర్థం వస్తుంది. ఇలా అనేక అవతారాలు వేస్తూ చూపరులకు ఆనందాన్నిచ్చే వారే బహురూపులు. వీరు పశ్చిమబెంగాల్‌లో కనిపిస్తారు. వీరు బహు రూపులే కాదు. బహుముఖ ప్రజ్ఞాశాలులు కూడా. ఆట, పాట, రాతతో పాటు నటన, అలంకరణ, వస్త్రాల ఎంపిక-కూర్పు మీద కూడా పట్టు వుంటుంది. సాధారణంగా రామాయణ మహాభారతాల వంటి పురాణాల నుంచి పాత్రలను ఎంపిక చేసుకుంటారు. ఆ పాత్రకు తగ్గ అలంకరణ, వస్త్రధారణ, మాటలు రాసుకుంటారు. ఉదాహరణకు అర్థనారీశ్వరుడిలా చేయాలనుకొంటే శరీరం పైనుంచి కింది వరకు స్త్రీ పురుష వేషధారణ (శివుడు, పార్వతిలా) చేసుకోవాల్సి వుంటుంది. ఒకే సమయంలో మగ, ఆడ గొంతులతో మాట్లాడుతూ అలరించాల్సి వుంటుంది. అదే కనకదుర్గ వేషం వేస్తే తగ్గ ఆయుధాలను కూడా సమకూర్చుకోవాలి. 150 సంవత్సరాల నుంచి ఈ బహురూపులు బెంగాల్ ప్రజలను అలరిస్తున్నారు. పూర్వం ఇంటింటికి తిరిగి పిల్లా పీచుతో సహా అందరినీ మెప్పించి ఇల్లాలు ఇచ్చిన కూరగాయలు, బియ్యం, స్వీట్లు, బట్టలు తీసుకుని సంతోషంగా వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వానాకాలంలో మాత్రమే పండుగ సీజన్‌లో వేషాలు వేస్తూ మిగతా సమయాల్లో కూలీ నాలీ చేసుకుని బతుకులు వెళ్లదీస్తున్నారు. వృద్ధాప్యం వచ్చాక కుర్రకారుకు అలంకరణ, ఆయుధాల సమీకరణ వంటి పలు అంశాలలో శిక్షణ ఇస్తూ పొద్దు పుచ్చుతున్నారు. మహిళలు మాత్రం మగవారికి సాయంగా వుంటారేకానీ వేషాలు మాత్రం వేయరు. ఆడపిల్లలు మాత్రం రకరకాల వేషాలు వేస్తారు. ఈ వృత్తి మీద ఆధారపడే వారి సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. కులవృత్తిని విడిచిపెట్టకుండా నేటికీ నిలబెడుతున్న వారే వీరంతా....!

Check List

Book Number	KNSR02B105	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29